నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి
నల్గొండ-యాదాద్రి-సూర్యాపేట
శుక్రవారం 15, డిసెంబర్ 2023 పేజీలు - 8

# నిజాయితీని చాటుకున్న హోంగార్డ్



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : యాదాద్రి ఆలయంలో విధులు నిర్వహించే హెూంగార్డు నిజాయితీని చాటుకుంది. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తుడిది బ్రాస్లెట్ కొండపైన బస్టాండులో పడిపోయింది. బ్రాస్లెట్ విలువ ఒక లక్ష యాభై వేలు రెండున్నర తులాలు. అక్కడ విధులు నిర్వహిస్తున్న మమతా అనే హోంగార్డ్ అది గమనించి ఎస్పీఎఫ్ జమీందార్ రామకృష్ణతో ఆలయ అడ్మిన్ ఏఇఓ గట్టు శ్రవణ్ ఆధ్వర్యంలో సదరు భక్తుడికి అప్పచెప్పడం అప్పగించినట్టు ఎస్పీఎఫ్ అధికారులు తెలిపారు.

# పంచాయితీ పోరుకు... సన్నద్ధం

**– గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణకు కసరత్తు – మళ్ళీ ఎన్నికల హడావిడి**

**– ఫిబ్రవరి 1తో ముగియనున్న పాలకవర్గం పదవీకాలం**

**– ఈనెల 30వ తేదీ నాటికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు**

**– మూడు దశలలో ఎన్నికలు – నిన్నటి వరకు అసెంబ్లీ ఎన్నికల పోరు**







*నల్లగొండ జిల్లా బ్యూరో*

నల్లగొండ జిల్లాలో నిన్నా మొన్నటి వరకు అసెంబ్లీ ఎన్నికల హడావిడి కొనసాగింది. ఎన్నికల పోరు ఫలితాల వెల్లడి అయిన వెంటనే స్థానిక సమరం నోటిఫికేషన్ వెలువడుతుందని తెలియడంతో గ్రామీణ ప్రాంతాలలో ఒక్కసారిగా మళ్లీ ఎన్నికల వాతావరణం నెలకొంది. 2024 ఫిబ్రవరి 1 తో గ్రామ పంచాయితీ పాలక వర్గాల పదవీకాలం పూర్తి కానుంది. పదవీ కాలం ముగిసే మూడు మాసాల ముందుగానే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం సిద్ధమవుతుంది. అన్ని పార్టీ నాయకులు స్థానిక సమరంలో తమ ఉనికిని కాపాడుకోవడం కోసం తహతహలాడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఫలితాల జోరును తిరిగి స్థానిక పోరులో కూడా సాధించాలని అధికార కాంగ్రెస్ పార్టీ ముమ్మర ప్రయత్నం చేస్తుండగా ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజేపి కూడా ఖచ్చితంగా స్థానిక సమరంలో పట్టు సాధించడం కోసం సమావేశాలు ఏర్పాటు చేసుకొని గ్రామాల్లోని కార్యకర్తలకు హితబోధ చేస్తున్నారు. గతంలో జిల్లాలో 844 గ్రామ పంచాయితీలు ఉండగా వాటి పరిధిలో మొత్తం 7440 వార్డులు ఉన్నాయి. ఈ పాలక వర్గాల పదవీకాలం 2024 ఫిబ్రవరి 1తో ముగియనుంది. పంచాయితీ రాజ్ చట్టం ప్రకారం పదవీకాలం ముగిసే మూడు మాసాల ముందుగానే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున ఎన్నికల సంఘం ఇప్పటికే గ్రామ పంచాయితీ ఎన్నికల సంఘం పూనుకుంది. డిసెంబర్ 30 లోగా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించి నట్టు సమాచారం. జిల్లాలోని నకిరేకల్ మండలంలోని 7 గ్రామ పంచాయితీలు మొదట మున్సిపాలిటీలో చేరాయి ఆ తర్వాత కోర్టు ఆదేశాలతో తిరిగా గ్రామ పంచాయితీలుగా మారాయి. అప్పట్లో వాటి పదవీ కాలం పూర్తయిన తర్వాత తిరిగి ఎన్నికలు నిర్వహించలేదు. ప్రస్తుతం ఆ గ్రామ పంచాయితీలు కలుపుకొని మొత్తం 844 పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల పోరును తలపించే విధంగా గ్రామీణ ప్రాంతాలలో నాయకులు తిష్ట వేసి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. స్థానిక ఎన్నికలను సైతం అన్ని పార్టీలు ఛాలెంజ్‌గా తీసుకొని గ్రూపులు లేకుండా తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయా పార్టీల నాయకులు ఆదేశాలు జారీ చేస్తూ కార్యకర్తలు సమిష్టిగా విజయంకోసం కృషి చేయాలని చెప్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ధీటుగా స్థానిక ఎన్నికల్లో నాయకులు లక్షల రూపాయలు వెచ్చించి గెలవాలని సర్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని పెద్ద పంచాయితీలకు కోటి రూపాయల వరకు ఖర్చు పెట్టి ఎన్నికల్లో విజయం పొందాలని ఆయా గ్రామాల్లో నాయకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని గ్రామాలలో పార్టీలను పక్కకు పెట్టి గ్రామ పంచాయితీ అభివృద్ధికి లక్షలాది రూపాయలు ఇస్తామని హామీ ఇస్తున్నారు. అధికారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికలను సీరియస్ గా తీసుకొని స్థానిక పోరులో తమ పార్టీది పై చేయి ఉండాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మొన్నటి వరకు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ స్థానిక పోరులో ఇప్పటి వరకు బిఆర్ఎస్ సర్పంచులు ఉండడంతో తిరిగి తమది విజయం అంటూ లోలోపల ప్రచారం చేస్తున్నారు. బిజెపికూడా ఈ సారి స్థానిక సమరంలో పాగా వేయాలని తీవ్ర ప్రయత్న ంచేస్తుంది. గ్రామ పంచాయితీలో అభివృద్ధికి కేంద్రం నిధులు ఇస్తుందని, ఈ సారి బిజెపి అభ్యర్థులను గెలిపించాలని గ్రామాలలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఏదేమైనప్పటికి నల్లగొండ జిల్లాలో స్థానిక ఎన్నకల హడావిడి జోరుగా కొనసాగుతుంది.

# కోరుకొండ సైనిక పాఠశాలలో ప్రవేశానికై ప్రకటన

*ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో*

2024-25 విద్యా సంంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక పాఠశాలలో 6వ తరగతి, 9వ తరగతులలో ప్రవేశానికై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటనను వెలువరించిందని జిల్లా కలెక్టర్ ఆ.వి.కర్ణన్ నేడొక ప్రకటనలో తెలిపారు. దీని ప్రకారం ఆరవ తరగతిలో బాలబాలికల ప్రవేశం కొరకు 10 నుండి 13 సంవత్సరాల వయసు 31.03.2024 వరకు ఉండి, 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 9వ తరగతిలో బాలబాలికల ప్రవేశం కొరకు 13 నుండి 15 సంవత్సరాల వయసు 31.03.2024 వరకు 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. జనరల్, ఎక్స్ సర్వీస్ మెన్, రక్షణ దళాల్లో పని చేయువారు, ఓబిసి విద్యార్థుల ప్రవేశ పరీక్ష ఫీజు 650 రూపాయలుగా, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 500 రూపాయలుగా నిర్ణయించారని తెలిపారు. https://exams.nta.ac.in/AISSEE/అనే వెబ్ సైటు ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు సమర్పించాలని, ఆన్లైన్ దరఖాస్తు చివరి తేదీ 16.12.2023 సాయంత్రం 5.00 గంటల వరకు ఉంటుందని, ప్రవేశ పరీక్ష ఆన్లైన్ ఫీజు చెల్లించుటకు చివరి తేదీ 16.12.2023 రాత్రి 11.50 గంటల వరకు కలదని, ప్రవేశపరీక్ష 21.01.2024, ఆదివారం రోజున ఓఎంఆర్ పద్ధతి ద్వారా నిర్వహించబడుతుందని, మరిన్ని వివరాలకై www.nta.ac.in లేదా https://exams.nta.ac.in/AISSEE/ అనే వెబ్ సైటును సందర్శించాలని తెలిపారు.

# అసెంబ్లీ సమావేశంలో పాల్గొన్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : నూతన స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్‌కు యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆశీస్సులు ఉండాలని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కోరుకున్నారు. గురువారం అసెంబ్లీ సమావేశాల్లో అలేరు నియోజకవర్గ శాసన సభ్యుడు బీర్ల ఐలయ్య హాజరయ్యారు. ప్రొటెం స్పీకర్‌గా ఉన్న అక్బరుద్దీన్ ఒవైసీ అధ్యక్షతన ఏకగ్రీవంగా నూతన మూడవ అసెంబ్లీ స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్‌ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను ఉద్దేశించి బీర్ల ఐలయ్య మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరుగా ఎన్ఎస్‌యూఐ, యూత్ నాయకుడిగా, ఎమ్మెల్యే మంత్రిగా సుదీర్ఘ

మిగతా 2లో

# కొత్త ప్రభుత్వం పైనే ఆశలు

**అద్వానంగా మారిన ఇటుకుల పహడ్ రహదారి**

శాలిగౌరారం, మేజర్‌న్యూస్ః ఏగ్రామానికైనా రవాణా సదుపాయం ముఖ్యం. అందులోనూ గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే రహదారులు బాగుండాలి. ప్రభుత్వం రోడ్లు, రహదారుల నిర్మాణానికి రూ.కోట్లు వెచ్చిస్తున్నప్పటికి కొన్ని గ్రామాలలో పరిస్థితి అద్వానంగా తయారైంది. మండలంలోని ఇటుకుల పహడ్ గ్రామానికి ఉన్న రోడ్డు మార్గం పూర్తిగా దెబ్బ తినడంతో ఆ గ్రామ ప్రజలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. మూసీ నది నుండి జరుగుతున్న ఇసుక రవాణాలతో మండలంలోని మాదారం కలాన్ నుండి ఇటుకులపహడ్ రోడ్ పూర్తగా దెబ్బతిన్నది. ఇటుకులపహడ్ గ్రామం చుట్టూ మూడు వైపులా మూసీప్రాజెక్ట్ నీరు నిల్వ ఉండటంతో ఆ గ్రామానికి వెళ్లాలంటె ఈ రోడ్డు మార్గమే దిక్కు. మండలంలోని మాదారం కలాన్ నుంచి ఇటుకులపహడ కు 3.5 కిలో మీటర్ల దూరం ఉంది. సుమారు దశ బ్ద కాలం క్రితం ఈ రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఆ తర్వాత వ్యాచ్ వర్క్ చేశారు. ప్రస్తుతం రోడ్డు మొత్తం 3.5 కిలోమీటర్లవేర పూర్తిగా ద్వంసమే వాహనాలు రాకపోకలకు వీల్లేకుండా మారడంతో గ్రామ ప్రజలు ప్రయాణికుల నానా అవస్థలకు గురవుతున్నారు. ద్విచక్ర వాహన దారులు రోడ్డుపై ప్రయణించే సమయంలో ఎదుకుగా వాహనలు వచ్చిన ప్పుడు గుంతలను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతల పుణ్యమా అని గ్రామానికి వచ్చే ఆర్టీసీ బస్సు సర్వీస్ నిలిచిపోయింది. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా గ్రామానికి రాలేని దుస్థితి ఎర్పాడిందంటే రోడ్డు పరిస్థితిని ఉహించుకోవచ్చు. వందల సంఖ్యలో ఇసుక లారీలు ఓవర్ లోడ్‌తో ఈ రోడ్డుపై ప్రయాణించడంతో రోడ్డు ద్వంసమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. బీటీ రోడ్డు అయినప్పటికి నేడు అది మట్టి రోడ్డులా మారింది. ఇటుకులపహడ్ రోడ్డును అభివృద్ధి చేయాలని నాలుగు సంవత్సరాల క్రితం గ్రామాన్ని సందర్శించిన సమయంలో కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు విన్నవించారు. అందుకు స్పందించిన వారు వీలైనంత త్వరలో రోడ్డు అభివృద్ధి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు కానీ నేటికి వారు ఇచ్చిన హామీలు అమలు నోచుకోలేదని ప్రజలు వాపోతున్నారు. ఈ కొత్త ప్రభుత్వంలోనైనా రోడ్లు అభివృద్ధి చెందుతాయని ఆశిస్తున్నారు.



# రూ. 50,000/– విలువ గల పుస్తకాలు అందజేత

### ★ ఫుడ్ ఫర్ థాట్ అనే స్వచ్ఛంద సంస్థ రూ. 50 వేల విలువ గల పుస్తకారలు అందజేత

### ★ హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి పుస్తకాలు వివతరణ



హుజూర్‌నగర్, మేజర్ న్యూస్ : నేటి యువతరం ప్రపంచంతో పోటీ పడుతున్నందున పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించ డానికి కృషి చేస్తున్న ఫుడ్ థాట్ అనే ఒక స్వచ్ఛంద సంస్థ గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దాదాపు రూ. 50,000/– ల విలువ గల పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మల్గిరెడ్డి భీమార్జున రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఈ పుస్తకాలను చదవడం వలన విద్యాసంబంధమైన విషయాలను నేర్చుకోవడమే కాక వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించు కోవచ్చని, విద్యార్థుల అభివృద్ధికి ఉపయోగపడతాయని అన్నారు. కళాశబూల గ్రంథాలయ అధికారి నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులలో జీవన విలువలు పెంచడానికి, భావి జీవితం సంతోషమయం కావడానికి ఈ పుస్తకాలు ఎంతో దోహదపడతాయనం అన్నారు. ఫుడ్ ఫర్ థాట్ సంస్థ నిర్వాహకురాలు మాధవి శర్మ మాట్లాడుతూ నేటి తరం కళాశాల, పాఠశాల విద్యార్థులలో పుస్తక పఠనం పూర్తిగా కరవడిందని, దానిపై ఆసక్తి కలిగించి, విద్యార్థులలో నూతన ఆలోచని విధానాలను పెంపొందించడానికి తమ సంస్థ నిరంతరం కృషి చేస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సమన్వయ కర్త కావేరి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమావేశంలో పాల్గొన్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

*(మొదటిపేజీ తరువాయి)*

అనుభవం కలిగి ఈరోజు అసెంబ్లీ స్పీకర్‌గా నియామకం కావడం శుభ దినం అని తెలిపి గడ్డం ప్రసాద్ కుమార్‌కి అభినందనలు తెలిపారు. ఆలేరు నియోజకవర్గ ప్రజల పట్ల శుభాకాంక్షలు తెలుపుతూ శ్రీ యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులు ఎల్లావేళలా ఉండాలని కోరారు. తల్లి సోనియా గాంధీ తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల కోసం పెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రతి గడపకు చేర్చేందుకు బాధ్యతాయుతంగా పనిచేస్తామని తెలియజేసారు. మా సమస్యలను అసెంబ్లీలో చెప్పుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. బడుగు బలహీనవర్గం నుండి ఈస్థాయికి చేరుకున్నందుకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అధికార, ప్రతిపక్షలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం

# జిల్లా సర్వసభ్య సమావేశం విజయవంతం చేయాలి

రామన్నపేట, మేజర్‌న్యూస్ : మండల కేంద్రంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు కట్ట మల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోయ రాములు మాట్లాడుతూ నూతనంగా భాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తూ ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా ఉపాధ్యాయులకు మంచి పిఆర్‌సీ ప్రకటించలని, 2004 నుండి నియమకమైన ఉద్యోగ ఉపాధ్యాయులు పాలిట శాపంగా మారిన సీపీయస్ విధానాన్ని రద్దు చేయాలని, ఆయన కోరారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా సర్వసభ్య సమావేశం భువనగిరి జిల్లా కేంద్రంలో ఈ నెల 17న జరుగుతుంది. ఈ సమావేశాన్ని విజయ వంతం చేయాలని, బోయ రాములు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మండల

# చలో ఢిల్లీ విజయవంతం చేయండి



చండూర్, మేజర్‌న్యూస్ : తెలంగాణలో మాదిగలకు జనాభా ప్రాతిపదికన 12 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఏకైక డిమాండ్ తో మాదిగ జేఏసి వ్యవస్థాపకులు తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి నాయకత్వంలో చలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడి కి పిలుపు నివ్వడం జరిగింది. అందుకు ఈ రోజు చండూరు సెంటర్లో మాదిగ జేఏసి జిల్లా అధ్యక్షులు కురుపాటి సుదర్శన్, సంఘ నాయకులు సంబంధిత కరపత్రం విడుదల చేయటం జరిగింది. అనంతరం జిల్లా అధ్యక్షులు కురుపాటి సుదర్శన్ మాట్లాడుతూ... ఈ నెల 18వ తారీఖున దేశ రాజధాని నడిబొడ్డు జంతర్‌లో మహాధర్నా, 19వ తారీఖున పార్లమెంట్ ముట్టడి చేపడుతున్నామని తెలిపారు. 2014 ఎన్నికల ప్రచారంలో నాటి ప్రతిపక్షంలో ఉన్న బిజెపి కేంద్రంలో అధికారంలోకి వస్తే వంద(100) రోజులలో వ ర్గీకరణను పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ఆమోదిస్తామని మాయమాటలతో మాదిగల ఓట్లను దండుకొని అధికారంలోకి వచ్చి ఇచ్చిన మాట మర్చిపోయిందని అన్నారు. ఈ ఎన్నికల్లో తిరిగి సాక్షాత్తు కేంద్ర ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలంగాణకు వచ్చి మాదిగల బహిరంగ సభలో పాల్గొని 30 సంవత్సరాల మాదిగల పోరాటానికి శుభం పలికి శుభవార్త చెబుతాడని ఎదురుచూసిన మాదిగ బిడ్డలకు ప్రధాన మంతి నిరాశే మిగిల్చారని అన్నారు. పార్లమెంట్‌లో బలం ఉన్నప్పుడు వ ర్గీకరణపై బిజెపికి చిత్తశుద్ధి ఉన్నప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కమిషన్ వేస్తామనటం సిగ్గుచేటని విమర్శించారు. ఈ పార్లమెంట్ సమావేశాలలో వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలని సుదర్శన్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో బిజెపికి తగిన బుద్ధి మాదిగలు చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఇరిగి గురునాథ్, తలారి పరమేష్, బొడ్డు యాదయ్య, మాదిగ సర్పంచుల ఫోరం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష... పాల్గొన్న మంత్రులు

**ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో**



"గత ప్రభుత్వంలో నల్గొండ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై ఎక్కడలేని నిర్లక్ష్యం వహించారని... తెలంగాణ రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ రైతులకు సాగునీటిని అందించేందుకు కనీస ప్రయత్నం కూడా జరగకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు". డా.బిర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో గురువారం "నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై" అయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలతో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సాగునీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న తెలంగాణ రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి... నల్లగొండ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులు, వాటికి కావాల్సిన నిధులు, పెండింగ్ లో ఉన్న అటవీ పర్మిషన్లు, ఆర్ అండ్ ఆర్ ఇబ్బందుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాటికి కావాల్సిన అటవీ పర్మిషన్లు తీసుకొస్తానని, ప్రభుత్వం నుంచి నిధులు అందేవిధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అయితే అధికారులు కూడా చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు. రాజకీయ నాయకులు ఐదేండ్లు, పదేండ్లు అధికారంలో ఉంటారు కానీ... ప్రజలు శాశ్వతమని పక్షపాతం లేకుండా అన్ని ప్రాంతాల ప్రజల అవసరాలను సమానంగా చూడాలని, అధికారులకు సూచించారు. అలా చూడకపోవడడం వల్లనే నల్లగొండ జిల్లా ప్రాజెక్టులు వెనకపడ్డాయని... ఈ వెనుకబాటులో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని ఆయన మండిపడ్డారు. ఇప్పటి వరకు ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రాజెక్టు ఎందుకు పూర్తి కాలేదని ఆయన నీటిపారుదల శాఖ ఇఎన్‌సి ని నిలదీశారు. "ఉదయ సముద్రం" ప్రాజెక్టు 2014 నాటికే 90% పూర్తయినప్పటికీ ఈ పది సంవత్సరాలలో మిగిలిన 10% పనులను ఎందుకు పూర్తి చేయలేకపోయారని ఆయన ప్రశ్నించారు. ఈ 10% పనులు పూర్తయితే లక్ష పైచిలుకు ఎకరాలకు సాగునీళ్ళు అందేవని... గత ప్రభుత్వం, అధికారుల నర్లక్ష్యం వల్ల పది సంవత్సరాలు నల్లగొండ రైతన్నలకు "ఉదయసముద్రం" నీరు అందలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇవే కాదు, జిల్లాకు సంబంధించిన "డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్" పనులు, "సింగరాజుపల్లి రిజర్వాయర్" పనుల, "పెండ్లి పాకాల రిజర్వాయర్ బ్యాలెన్సింగట" పనులు, "గొట్టెముక్కల రిజర్వాయర్" పనులు, పిల్లాయిపల్లి కెనాల్" పనులు, "నెల్లికల్ లిఫ్ట్" పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉండిపోయాయని ఆయన మండిపడ్డారు. రాబోయే రోజుల్లో తాను, జిల్లాకు చెందిన ఇరిగేషన్ మంత్రి మండలి చైర్మన్, అందరు ఎమ్మెల్యేలను కలుపుకొని ప్రభుత్వం నుంచి కావాల్సిన నిధులను మంజూరీ చేయిస్తామని, ఇక నుంచి జిల్లాలో ఒక్క ప్రాజెక్టు పెండింగ్ లో ఉండకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ నల్లగొండ, ఖమ్మం , కరీంనగర్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# అరణ్యం

తిప్పర్తి, మేజర్‌న్యూస్ : అడవులు భద్రంగా ఉంటే మనుషులు క్షేమంగా ఉంటారు. ఈ చిన్న విషయం తెలియక కాదు, తెలిసీ అడవుల విధ్వంసాన్ని ఆపలేకపోవడం ఆధునిక మానవుని దుస్థితి. మరీ ముఖ్యంగా సంపన్న వర్గాల, సంపన్నదేశాల విధానాలు అడవుల క్షయానికి దారితీస్తున్నాయి. ఇటీవల అమెజాన్ అడవులు దగ్ధం కావడం పర్యావరణవేత్తల్ని, ప్రకృ్రుతి ప్రేమికుల్ని తీవ్ర ఆందోళనకు లోను చేసింది. ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. తమ అభివృ్ద్ధికి ఆటంకమైతే అడవుల్ని ఉపేక్షించడం సాధ్యం కాదన్నది పాలకుల సమాధానం.

మన దగ్గర నల్లమల్లలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా వినిపించిన తీవ్ర నిరసనల నేపథ్యంలో వాటిని అనుమతించబోమని పాలకులు చెప్పారు. అయినప్పటికీ ఆచరణలో ఏం జరుగుతుందన్నది ప్రశ్నే.. ఆదిమానవుల నివాసం అరణ్యమే. అరణ్యాల్ని దాటుకొని ప్రయాణించే క్రమాన చెట్లని నరికివేసి, వ్యవసాయయోగ్యమైన భూములుగా మార్చారు. అంతమాత్రాన ఇవాళ భారీ ప్రాజెక్టులు, మైనింగ్ తవ్వకాల కోసం వేలాది హెక్టార్ల అడవుల్ని నిర్మూలించడం క్షంతవ్యం కాదు. ఎందుకంటే జీవవైవిధ్యం సమతుల్యం మీదనే మానవుని జీవనం ఆధారపడి ఉంది. ఉత్తరాఖండ్‌లో ఉవ్వెత్తున వచ్చిన వరదలకు, అక్కడ కొండల మీద నిర్మించిన ప్రాజెక్టులే కారణమని పర్యావరణవేత్తలు తేల్చిచెప్పారు.

మానవుని అవసరాలకు అనుగుణంగా అడవుల్ని ఉపయోగించుకోడంలో తప్పులేదు. అడవుల్లోని జీవ వైవిధ్యానికి, పచ్చదనానికి భంగం కలగకుండా వాటిని వినియోగించుకునే విధివిధానాల్ని అనుసరించాలి. దీనికి భిన్నంగా అడవుల్ని నేలమట్టం చేయడం దుర్మార్గం. ఇది కూర్చున్న చెట్టు కొమ్మను తానే నరుక్కోవడం వంటి ఆత్మహత్యాసదృ్రుశ్యమైన చర్య.

ఈ సత్యం అందరికీ తెలుసు. అయినా లక్షల హెక్టార్ల అడవుల నిర్మూలనకు ప్రభుత్వాలు అనుమతించడం వైచిత్రి. కలపదొంగల వల్ల, జంతువుల్ని వేటాడేవారి వల్ల జరిగే నష్టం చాలా చిన్నది. వీరితో పో లిస్తే అడవి ఉనికిని దెబ్బతీసే ప్రభుత్వ విధానాలు అడవులకీ, వాటిని అంటిపెట్టుకొని ఉన్న జనాలకీ తీవ్రమైన శరాఘాతం. ఒకవైపు అటవీభూభాగ విస్తీర్ణం తగ్గిపోతుంటే మరోవైపు ఈ విస్తీర్ణం పెరుగుతున్నట్టుగా ప్రభుత్వం చెబుతున్నది. ఇది అంకెల గారడీ. ఒకప్పుడు మన దేశంలో 30శాతానికి పైగా అడవులు విస్తరించి ఉండేవి. ఇవుడు దేశ భూభాగంలో అటవీ విస్తీర్ణం 21.34శాతం మాత్రమే. దట్టమైన అరణ్యాల జోలికి అసలు వెళ్ళకూడదని అంతర్జాతీయంగా పర్యావరణవేత్తలు పదేపదే చెబుతున్నారు. కానీ మన దేశంలో భారీ డ్యాంల కోసం, రక్షణ విభాగం, జలవిద్యుత్ ప్రాజెక్టులు, గనుల నిర్మాణం కోసం దట్టమైన అరణ్యాల్ని సైతం నిర్మూలిస్తున్నారు. దీని ప్రభావం దీర్ఘకాలికం. జీవవైవిధ్యం దెబ్బతినడమే కాక అకాల వర్షాలు, తుఫాన్లు, వరదలు, భూకంపాలు తలెత్తడానికి దారితీస్తుంది.

అభివృ్ద్ధి జరగాలంటే అడవులు అంతరించక తప్పదనే వాదన ముందుకు తెస్తున్నారు. అభివృ్ద్ధి ఎవరికోసం, ఎందుకోసమనే ప్రశ్నలకు సరయిన జవాబు ఉండదు. దేశీయ పెట్టుబడిదారులకోసం, బహుళజాతి కంపెనీల కోసం అడవుల్ని నిర్మూలించడాన్ని భవిష్యత్ తరాలు క్షమించవు. అడవుల్ని నరికివేసే క్రమాన ఎన్ని చెట్లను కోల్పోతారో, అన్ని చెట్లను ప్రత్యామ్నాయంగా మరోచోట పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రకారం కృ్రుత్రిమంగా మొక్కల పెంపకం కార్యక్రమాలు చేపడుతున్నారు.

# రైతుపై తూటా

చందంపేట, మేజర్‌న్యూస్ : రైతాంగ ఆత్మహత్యలు నివారిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని హామీలిచ్చి కేంద్రంలోను, మధ్యప్రదేశ్‌లోను అందలమెక్కిన బీజేపీ ప్రభుత్వాలు అన్నదాతలపైనే తుపాకీ ఎక్కుపెట్టడం హేయమైన చర్య. ఒకవైపు కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ మరో వైపు రైతులను పిట్టలను కాల్చినట్టు కాల్చివేసిన పాలకుల కిరాతకాన్ని ఎంత ఖండించినా తక్కువే. మధ్యప్రదేశ్‌లో రైతులు తాము పండించిన పంటకు మద్దతు ధర కావాలని అడిగారు. ఎన్నికల ముందు బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాత్రమే వారు కోరారు. రైతులపైకి పోలీసులను ఉసిగొల్పి ఆరుగురిని పొట్టనబెట్టుకోవడం దుర్మార్గం. సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ ప్రభుత్వమైనా నిర్వర్తించాల్సిన కనీస బాధ్యత. దీనిని విస్మరించి నిరంకుశంగా అణచివేయాలని చూడడం అప్రజాస్వామికం. మధ్యప్రదేశ్‌లో మొదట ఒక జిల్లాలో ప్రారంభమైన రైతుల ఆందోళన క్రమంగా రాష్ట్రంలోని మిగతా అన్ని జిల్లాలకు విస్తరించింది. మందసోర్, పిప్లియామండీ ప్రాంతాల్లో ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి రైతుల పోరాటాన్ని అణచివేయాలని చూసింది. ఈ పాపంలో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వానికీ వాటా వుంది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేండ్లు గడిచినా రైతాంగాన్ని ఆదుకునేందుకు ఎలాంటి చర్య తీసుకోలేదు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. నయా ఉదారవాద విధానాలతో ఇప్పటికే సంక్షుభితంగా మారిన వ్యవసాయరంగం మోడీ ప్రభుత్వ నిర్వాకం వల్ల మరింత తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడింది. మధ్యప్రదేశ్‌లో కాల్పులు దీనికి పరాకాష్ట. కేవలం ఒక్క మధ్యప్రదేశ్‌లోనే కాదు, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోను, దాని మిత్రపక్షాలు అధికారంలో వున్న రాష్ట్రాల్లోను రైతు వ్యతిరేక విధానాలు ఉధృతంగా అమలవుతున్నాయి. మొత్తం రైతు ఆత్మహత్యల్లో 60శాతం దాకా ఈ రాష్ట్రాల్లోనే చోటు చేసుకున్నాయని అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి. మొదట గుజరాత్ రైతాంగం వీధుల్లోకి వచ్చింది. నేడు మహారాష్ట్రలో రైతాంగ పోరాటాలు ఉధృతంగా సాగుతున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఈనాడు బీజేపీ ప్రభుత్వ విధానాలపై ఈ దేశ రైతాంగం తిరుగుబాటు చేస్తోంది. మధ్యప్రదేశ్‌లో రైతాంగ పోరాటం, మహారాష్ట్రలో రైతులు వారం రోజుల పాటు నిర్వహించిన సమ్మె, రాష్ట్ర బంద్ అసాధారణమైనది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అనే కాదు, మిగతా రాష్ట్రాల్లోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై రైతాంగంలో ఆగ్రహం రగుల్కొంటోంది. ఛత్తీస్‌ఘడ్, హర్యానా, జార్ఖండ్‌ల్లో రైతాంగ పోరాటాలు సాగుతున్నాయి. రైతుల పోరాటానికి బాసటగా నిలవాలని సామాజిక కార్యకర్త అన్నా హజారేను రైతు సంఘాలు కోరగా ఆయన అందుకు నిరాకరించారు. ఇది ఆయన సంకుచిత ధోరణికి నిదర్శనం. ఎఐకెఎస్, ఇతర రైతు సంఘాల ఆధ్వర్యాన మహారాష్ట్ర రైతులు పట్టుదలతో పోరాడుతున్నారు. రైతులు తమ నిరసనలో భాగంగా వ్యవసాయోత్పత్తులను పట్టణాలకు సరఫరా చేయడానికి నిరాకరిస్తున్నారు. వాటిని రోడ్లపై పారబోస్తున్నారు. మహారాష్ట్రలోని ఫడ్నవీస్ ప్రభుత్వం రైతులతో చర్చించి సామరస్యంగా దీనిని పరిష్కరించుకోవడానికి బదులు ఈ ఉద్యమాన్ని అణచివేయాలని చూడడం అవివేకం. తమిళనాడులో 140ఏండ్లలోనే అతి పెద్దకరువు గత సంవత్సరం చోటు చేసుకుంది. ఈ కరువు బారిన పడి ఇప్పటివరకు 400మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విపత్కర పరిస్థితినుంచి తమిళనాడును ఆదుకునేందుకు 40వేల కోట్ల ప్యాకేజీ కావాలని తమిళనాడు రైతులు నలభై రోజులకుపైగా ఆందోళన నిర్వహించారు. రాజధాని ఢిల్లీలో దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. రైతులు ఎంత ఘోషించినా రుణమాఫీ చేసే ప్రసక్తే లేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తెగేసి చెప్పారు. కరువుతో అల్లాడుతున్న తమిళనాడుకు ఇంతవరకు పైసా కూడా సాయం చేయలేదు. పైగా సుప్రీం కోర్టులో దీనిపై కేంద్రం తన వాదన వినిపిస్తూ తమిళనాడులో రైతులెవరూ ఆత్మహత్య చేసుకోలేదని చెప్పింది. ఇది తమిళప్రజలతో క్రూర పరిహాసమాడటమే. రైతులను ఉద్ధరించేందుకే తెచ్చానని ఘనంగా చెప్పుకున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన రైతులకు అక్కరకు రాలేదు. కానీ కార్పొరేట్ బహుళజాతి కంపెనీలకు దండిగా కాసులపంట పండించింది. ఫసల్ బీమా యోజన కింద 2016-17లో ప్రయివేట్ బీమా కంపెనీలు ప్రీమియం రూపంలో రైతుల నుంచి 21,500 కోట్లు దండుకున్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పరిహారం కింద 4,270 కోట్లు క్లెయిమ్ చేయగా, 714 కోట్లు మాత్రమే ఇచ్చాయి. దీనిని బట్టి ఈ ఫసల్ బీమా యోజన ఎవరికోసం ఉద్దేశించిందో ఇట్టే అర్థమవుతోంది. వ్యవసాయరంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడం, మేడ్ ఈజీ బిజినెస్ వంటి విధానాల ద్వారా మోడీ సర్కార్ ఈ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నది. దీనికి వ్యతిరేకంగా గ్రామీణ పేదలు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఆదివాసీలు సమైక్య పోరాటాలను ఉధృతం చేయడం ఒక్కటే మార్గం.

# వివక్ష లేని సమాజం కోసం

నాంపల్లి, మేజర్‌న్యూస్ : సమాజంపై అవగాహన ఎందరికో ఉండొచ్చు... మార్పులనే తపన కొందరికే ఉంటుంది. అలా తపించే వారిలో ప్రొఫెసర్ లక్ష్మి ఒకరు. సమానత్వం, వివక్ష లేని మరో సమాజం కోసం నిరంతరం పోరాడుతున్నారు. విద్యార్థి దశ నుంచే హ్యూమనిస్టుగా, యాక్టివిస్టుగా స్త్రీ సమానత్వం కోసం గొంతు విప్పారు. ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీకి మొదటి మహిళా ప్రిన్సిపల్‌గా చరిత్ర సృష్టించారు. రిటైర్‌మెంట్ తర్వాత కూడా స్త్రీ సమస్యలపై తన పోరాటం ఆపలేదు. ముఖ్యంగా ఇటీవల రాష్ట్రంలో పెట్రేగుతున్న కుల దురహంకార హత్యలకు వ్యతిరేకంగా తన గొంతు విప్పుతున్న ఆమెతో మానవి సంభాషణ...

ఇటీవల మన రాష్ట్రంలో కులదురహంకార హత్యలు బాగా జరుగుతు న్నాయి. వీటికి కారణం ఏమిటి?

ఇవి గతంలో కూడా ఉన్నాయి. అయితే బయటకు వచ్చే వాటి సంఖ్య చాలా తక్కువ. ఇప్పుడు మీడియా పెరిగిపోవడం వల్ల బయటకు ఎక్కువగా వస్తున్నాయి. కులం, మతం, మూఢనమ్మకాలు, సంప్రదాయాలు, ఇలా వీటన్నింటి వల్ల తల్లిదండ్రులు కులపెద్దలు పిల్లల ఇష్టాలను అంగీకరించడం లేదు. రోజురోజుకు సమాజంలో కుల సమస్య పెరిగిపోతుంది. అందుకే ఈ హత్యలు జరుగుతున్నాయి.

ఈ వివాహాల వల్ల అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలు?

మొదట తల్లిదండ్రులు ఆమె ప్రేమను అంగీకరించరు. ఇంట్లో వాళ్ళ ఇష్టాన్ని కాదని పెండ్లి చేసుకుంటే ఇల్లు వదిలి వెళ్ళిపోవాలి. సమాజం కూడా అమ్మాయి నిర్ణయాన్ని స్వాగతించదు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్కరికైనా ఉద్యోగం లేకపోతే బతకడం కష్టం. ఆర్థిక ఇబ్బందులు వస్తాయి. ఈ ప్రభావం అమ్మాయిలపైనే ఎక్కువగా ఉంటుంది.

అసలు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే అవకాశం అమ్మాయిలకు ఎంత వరకు ఉందంటారు?

ఈ పితృస్వామ్య సమాజంలో ఆడపిల్లతో పాటే ఆంక్షలు, కట్టుబాట్లు కూడా పుడతాయి. ఎలాంటి బట్టలు వేసుకోవాలి?, ఎలా మాట్లాడాలి?, ఏం తినాలి?, ఎంత తినాలి? వరకు అన్నీ ఆంక్షలే. పెండ్లి సంబంధం వస్తే 'ఈ అబ్బాయి నాకు ఇష్టం లేదు' అని అంటే 'నోరుమూసుకో ఇంకెవరికీ చెప్పకు, నీ చెల్లెళ్ళకు పెండ్లి కాదు' అంటారు. రాజ్యాంగం ప్రకారం వివాహానికి సంబంధించి సమ్మతి హక్కు అమ్మాయికి ఉంది. కానీ దాన్ని ఎవ్వరూ పట్టించుకోరు. అమ్మాయికి జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ కల్పించాలి.

తల్లి ఇంటి పేరు, కులం పెట్టుకోవడంలో ఎన్నో ఆటంకాలు ఉన్నాయి. దీని గురించి మీరేమంటారు?

ఏ బిడ్డకైనా తల్లి ఒక వాస్తవం, తండ్రి ఓ నమ్మకం. తొమ్మిది నెలలు మోసిన తల్లి కులం బిడ్డకు వర్తించదంటారు. ఇది సరైనది కాదు. గతంలో స్కూల్లో తండ్రిపేరే అడిగేవారు. కానీ మహిళా ఉద్యమాల ఫలితంగా తల్లిపేరు కూడా చేర్చు కోగ లిగాం. అలాగే ఓ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పిల్లలు తల్లిదండ్రుల కులాల్లో తమకు ఇష్టమైన ఏ కులాన్నైనా పెట్టుకోవచ్చు.

మొదటి నుంచి మానవీయ విలువలతో పెరిగారు. మీ బాల్యం ఎలా గడిచింది?

మాది మిర్యాలగూడ. అక్కడే పుట్టి, పెరిగాను. అమ్మ విరాటమ్మ, నాన్న రామచంద్రయ్య. ఇద్దరూ వ్యవసాయం చేస్తారు. అమ్మ చాలా కష్టపడేది. మా ఇంట్లో అన్ని కులాల వారినీ సమానంగా చూసేవారు. మేము ఎనిమిది మంది సంతానం. మా అమ్మ చదువు కోలేదు. నాన్న కొద్దిగా చదువుకు న్నారు. కానీ.. సామాజిక అవగాహనతో మమ్మల్ని చదివించారు. అయితే పదో తరగతి పూర్తి కాగానే ఆడపిల్లకు పెండ్లి చేయాలి అని భావించే పల్లెటూరు మాది. నాకూ అలాగే చేయాలనుకున్నారు. అయితే నేను ఒప్పుకోలేదు. స్కూల్ టాపర్ కావడంతో అన్నయ్యలు సపోర్ట్ ఇచ్చి ఇంటర్‌లో చేర్చారు. తర్వాత ఖమ్మంలో మా అన్నయ్య ఇంట్లో ఉండి అక్కడే డిగ్రీ చేశాను. మళ్ళీ ఇంటికి వెళితే పెండ్లి చేస్తారని అటునుంచి అటే స్నేహితులతో కలిసి హైదరాబాద్ వెళ్ళి పీజీకి ఎంట్రన్స్ రాశాను. మా ఊరి నుంచి ఎంట్రన్స్ రాసిన వారిలో యూనివర్శిటీలో సీటు వచ్చింది నాకొక్కదానికే. దాంతో ఊళ్ళో అందరూ మెచ్చుకున్నారు. దాంతో అమ్మానాన్నలు గర్వపడ్డారు. నేను ధైర్యం చేసి ఇంటికి వెళ్ళి డబ్బులు తెచ్చుకుని పీజీ పొలిటికల్ సైన్స్‌లో చేరాను. అలా మా కుటుంబంలో ఉన్నత విద్యను చదవిన మొదటి ఆడపిల్లను నేనే.

టీచింగ్‌వైపుకు ఎందుకు వచ్చారు?

పీజీ పూర్తి చేసిన తర్వాత బ్యాంక్ ఉద్యోగం కూడా వచ్చింది. కానీ ఆ టేబుల్ వర్క్ చేయడానికి మనసు అంగీకరించలేదు. ఎమ్‌ఫిల్‌లో చేరాను. తర్వాత 'మహిళా నాయకత్వం' అనే అంశంపై పీహెచ్‌డీ చేశాను. ఎప్పటికైనా అవినీతి ఉండని జాబ్ చేయా లనుకున్నాను. అప్పట్లో అలాంటి జాబ్ టీచింగ్. దాంతో ఇక టీచింగ్ చేయాలని నిర్ణయించుకున్నాను. ఈ వృత్తిలోకి వచ్చిన తర్వాత యంగ్ టీచర్, బెస్ట్ టీచర్ అవార్డు తీసుకున్నాను. 2002లో ప్రొఫెసర్‌గా, తర్వాత ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించాను.

మరి యాక్టివిస్టుగా ఎలా మారారు?

విద్యార్థినిగా లేడీస్ హాస్టల్ వార్డెన్‌గా బాధ్యతలు చూసేదాన్ని. అక్కడే అనేక విద్యార్థి సంఘాలతో పరిచయాలు ఏర్పడ్డాయి. మా హాస్టల్లో పని చేసే వర్కర్లు ఉండే బస్తీలకు వెళ్ళి వాళ్ళకు అక్షరాలు నేర్పించేవాళ్ళం. యూనివర్సిటీలో ఏ అన్యాయం జరిగినా వ్యతిరేకించేవాళ్ళం. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం చేసేవాళ్ళం. జెండర్ సమస్యపై, సేవ్ గర్ల్ చైల్డ్ లాంటి ఎన్నో కార్యక్రమాలు చేశాం. ఉమెన్స్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా మరెన్నో కార్యక్రమాలు చేశాం. ముఖ్యంగా అమ్మాయిలకు లీగల్, సోషల్ కౌన్సెలింగ్ ఇచ్చేవాళ్ళం.

మీదీ కులాంతర వివాహమే కదా, ఏమైనా సమస్యలు ఎదుర్కొన్నారా?

సమస్యలేమీ లేవు. మా వారి పేరు శివాజీ. ఆయన నాతో పాటు పీహెచ్‌డీలో చేశారు. దండలు కూడా మార్చుకోకుండా రిజిస్టర్ ఆఫీసుకు వెళ్ళి సంతకాలు పెట్టి వచ్చేశాం. పెద్దలు మాత్రం రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఆయనా లెక్చరర్‌గా చేసేవారు. అది మానేసి ప్రస్తుతం 'సర్వ్' అనే సోషల్ ఆర్గనైజేషన్‌లో పని చేస్తున్నారు. గ్రామాల్లో దళితులు, చెంచుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. మాకు ట్రిపులెట్ బేబీస్. ముగ్గురు బాబులు. ప్రస్తుతం ఇంటర్ పూర్తి చేసి పై చదువులకు సిద్ధంగా ఉన్నారు.

ఇన్ని బాధ్యతలు నిర్వర్తించారు. మీరెప్పుడైనా జెండర్ సమస్యను ఎదుర్కొన్నారా?

నేను స్ట్రాంగ్. అందుకే నా జోలికి ఎవ్వరూ రారు. అయితే యూనివర్సిటీలో జెండర్ సమస్యలు చాలా ఉన్నాయి. వీటిపై కచ్చితంగా పని చేసేవాళ్ళం. ఇప్పటికీ చేస్తున్నాం.

సరైన గైడెన్స్ ఇస్తే...

మహిళలు ఓ వ్యక్తిత్వంతో పెరగాలి. చదువుకోవాలి. స్వతంత్రంగా బతికే హక్కు ఉంది అని నమ్మాలి. నీ శరీరంపై నీకు హక్కు ఉండాలి. తనలో ఉన్న శక్తిని గుర్తించాలి. నేను ఆడపిల్లను అనే భావనను పక్కన పెట్టాలి. శారీరకంగా, మానసికంగా స్ట్రాంగ్‌గా ఉండాలి. నా కెరీర్‌లో ఎంతో మంది విద్యార్థులను చూశాను. యువతకు సరైన గైడెన్స్ ఇస్తే మంచి దారిలో వెళతారు. నా దృష్టిలో టీచర్ అంటే పుస్తకాల్లో ఉండేది నాలుగ్గోడల మధ్య చెప్పడం కాదు, సమాజం గురించి, జీవితం గురించి నేర్పాలి. ఉపాధ్యాయులు ఇలా చేయగలిగితే ప్రతి అమ్మాయి, అబ్బాయి ఆణిముత్యాల్లా తయారవుతారు.

ప్రత్యేక చట్టం కావాలి

దేశంలో సమసమాజం రావాలన్నా, కులర హిత సమాజం ఏర్పడాలన్నా, స్త్రీ-పురుషుల మధ్య అంతరాలు తొలగించాలన్నా కులాంతర వివాహాలు చేసుకునే వారికి కొన్ని అవకాశాలు కల్పించాలి. వీరికి రక్షణ కల్పించే ప్రత్యేక చట్టం కావాలి. ముందు ఆ జంటకు ఆర్థికంగా సహకరించాలి. ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. అమ్మాయిలకు ధైర్యం చెప్పాలి. వారి పిల్లలకు అన్నింట్లో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి. అలాగే భద్రత అనేది కీలకం. కాబట్టి వీరి వివాహాలను రికార్డ్ చేయాలి. అన్నింటి కంటే ముఖ్యమైనది ఇలాంటి వివాహాల పట్ల సమాజానికి అవగాహన కల్పించాలి.

విధాన నిర్ణయాల్లో

భాగస్వామ్యం

విధాన నిర్ణయాల్లో మహిళలకు భాగస్వామ్యం లేదు. మహిళల సమస్యలంటే సంస్కరణ దృష్టితోనే చూస్తున్నారు. మహిళలకు విధాన నిర్ణయాల్లో ప్రాధాన్యం ఇవ్వకుండా స్త్రీ సమానత్వం సాధ్యం కాదు. మన రాష్ట్రంలో మంత్రి మండలిలో ఒక్క మహిళకు అవకాశం ఇవ్వలేదు. వీసీలుగా ఒక్క మహిళను తీసుకోలేదు. ఏండ్లు గడుస్తున్నా మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగానే చూస్తున్నారు. సమాజంలో సగభాగమైన మనకు అధికారంలో కూడా మన వాటా మనకు రావాలి.

# లక్ష్యం

నాంపల్లి, మేజర్‌న్యూస్ : పడుకున్నవాడు లేచి తిరిగి మళ్లీ పడుకోవడమే జీవితమని కొందరంటున్నారు. 'కలకానిది విలువైనది జీవితం' అన్నాడు.. శ్రీశ్రీ. జీవితం ప్రవాహం, జీవితం నది, జీవితం స్రవంతి. ప్రవాహం నిరంతరం కదులుతుంటుంది. కదలికలేని ప్రవాహం లేదు. నది నిరంతరం చలనంతో ఉంటుంది. అయినా చలించినట్టు కనబడదు. నిరంతరం కదులుతూ కదిలినట్టు కనిపించనిదే జీవితం అంటాడు దాశరథి రంగాచార్య. నది ప్రవాహం జీవనవేగాన్ని సంకేతిస్తున్నది. నీటి పరుగు చైతన్యాన్ని సూచిస్తున్నది. జీవిత ప్రవాహం ప్రచండ వేగంతో వెళ్లిపోతూ ఉంది. అందులో ఎవరెవరి సంస్కారాన్ని బట్టి వాళ్లు తమ సుఖం కోసం కొట్లాడుకుంటున్నారు అంటాడు అసమర్థుని జీవయాత్రలో గోపీచంద్. అసలు మనం సక్రమంగా జీవించలేకపోతున్నాం... జీవితంలో అనేకనేక అవకాశాలు మన ముందు కొస్తుంటాయి. అన్నీ ముఖ్యమనిపించినా ఎదురైన ప్రతి అవకాశం అందిపుచ్చుకోలేము. అందుకే జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికున్న అవకాశాలను పరిశీలించుకుని ముందుకు పోవాల్సి ఉంటుంది. నీటి ప్రవాహాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. ప్రవాహానికి అడ్డువస్తే నీళ్లు అక్కడే ఆగిపోవు. కొత్తదారి వెతుక్కొని కొండల్లో జలపాతాలుగా రాళ్ల మధ్య పాయలుగా, ఇసుకమేటల్లో ఏర్లుగా ప్రయాణాన్ని సాగిస్తాయి. విద్యార్థి అయితే తాను ఏ వృత్తిలో స్థిరపడదలచుకున్నాడో లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. అందుకనుగుణమైన కోర్సునే ఎంచుకోవాలి. ఊహల్లో విహరించకుండా వ్యూహంతో చదివితే లక్ష్యం సిద్ధిస్తుంది. ఎక్కడో మారుమూల ప్రాంతంలో పేదరికంతో పోరాడుతూ... గోపాలకృష్ణ ఐఏఎస్ లక్ష్యంగా నిర్దేశించుకుని విజయం సాధించిన అనుభవం మన కండ్లముందే కనబడుతున్నది. "ఒక నదిని దాటడం నీ లక్ష్యమైతే.. అందుకు నావగాని, వంతెన గాని లేకుండా నదిని దాటడం సాధ్యం కాదు" అన్నాడు మావో. అంటే లక్ష్యం మంచిదైనా దాన్ని చేరుకోవడానికి నిర్ణయించుకునే సాధనాలపైన జయాపజయాలు ఆధారపడి ఉంటాయి. ఏ లక్ష్య సాధనకైనా క్రమశిక్షణ అవసరం. వ్యక్తిగత లక్ష్యాలతో లాభనష్టాలూ కష్టసుఖాలు ఆయా వ్యక్తుల వరకే పరిమితం అవుతాయి. అదే మన సమాజానికి బాధ్యత వహించినప్పుడు సమిష్టి లక్ష్యంగా మారుతుంది. తప్పుడు లక్ష్యాల వల్ల మనమే కదా నష్టపోయేది అనుకుంటే కుదరదు. దాని ప్రభావం మొత్తం సమాజంపైనా ఉంటుంది. లక్ష్యాలు ఉన్నతమైనవైతే సాధనలెలాంటివైనా పరవాలేదా? శంకరాచార్యుడు జీవాత్మ - బ్రహ్మాత్మల ఏకత్వాన్ని తెలుసుకోవడమే లక్ష్యం అన్నాడు. ఇందుకు జ్ఞాన సంపాదన మార్గమన్నాడు. వీరు వాస్తవ జీవితంతో సంబంధం లేని లక్ష్యాన్ని ఎంచుకున్నారు. కమ్యూనిస్టుల దృష్టిలో జీవిత లక్ష్యం మానవజాతి సుఖసంపదలతో జీవించడం. భౌతికంగానూ, సాంస్కృతికంగానూ అంతకంతకు ఉన్నత శిఖరాలకు ఎదగడం. ప్రతి మానవుడు తోటి వారితో కలిసి మానసిక శక్తులను అభివృద్ధి చేసుకోవడానికి అంతకంటే ఎక్కువ స్వేచ్ఛ సంపాదించడం. పరాయి పాలనకు స్వస్తిపలికి స్వాతంత్ర్యం సాధించుకునేందుకు భారత ప్రజలు శత సంవత్సరాలు పోరుసల్పారు. ఈ వందేండ్ల స్వాతంత్ర్య పోరాటం మన లక్ష్యంగా ఉన్నది. లక్ష్యం మహోన్నతమైనదని అందరూ అంగీకరించారు. ఏకాభిప్రాయానికి వచ్చారు. కానీ సాధన మార్గం విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవచ్చు. అహింసను జీవిత లక్ష్యంగా పెట్టుకున్న గాంధీ మహాత్ముడే పిరికితనంతో బానిస జీవితం గడపడం కన్న దౌర్జన్యం.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజానీక మునకు తెలియజేయు నేదేమనగా, నా యొక్క క్లయింట్ వంగాల విజయలక్ష్మి W/o రావుల విప్లవ రెడ్డి R/o విద్యానగర్, నల్లగొండ గారి తరుపున చేయు బహిరంగ ప్రకటన ఏమనగా తేది: 04-12-2023 ఈనాడు దినపత్రిక నల్లగొండలో ఇచ్చినటువంటి పబ్లిక్ నోటీసు శ్రీ అల్వాల వసంత రావు అడ్వకేట్, అతని క్లయింట్ కట్టూరి నిరంజన్ రెడ్డి తండ్రి రాఘవ రెడ్డి R/o జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్, దానిలో ఎటువంటి నిజము లేదు. నా క్లయింట్ అగు వంగాల విజయలక్ష్మి గారికి వ్యవసాయ భూమి Ac. 2-39 గుం. Sy. నెం. 359/AA1/2/1 గొల్లగూడ శివారు, నల్లగొండ నందు గలదు. అట్టి భూమిని ఎవ్వరికీ అమ్ముకొనికి పెట్టలేదు మరియు ఎవ్వరి నుండి అడ్వాన్సు తీసుకొనలేదు. నదరు నిరంజన్ రెడ్డి ఎవ్వరో కూడా నా క్లయింట్‌కు తెలియదు. ఎలాంటి క్రయ విక్రయ లావాదేవీలు అగ్రిమెంట్ లేకుండా తప్పుడు బహిరంగ ప్రకటన చేయడము నేరము కావున నా క్లయింట్ తీసుకొనబోయే క్రిమినల్ మరియు సివిల్ చర్యలకు బాధ్యులు కాగలరు.

ఇట్లు
కేమ కాళిదాస్, కేమ అనూరాధ,
అడ్వకేట్స్,
సి-10, ప్లాట్ నెం. 102, ఆనంద్ శ్రీ నిలయం, చిత్ర లేఅవుట్, ఎల్.బి. నగర్, ఆర్.ఆర్. జిల్లా

సూర్య



# పలు హోటల్స్ పై ఆకస్మికంగా తనిఖీలు

## ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట పట్టణంలోని పలు హెూటల్స్ పై ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డాక్టర్ ఎం సుమన్ కళ్యాణ్ ఆదేశానుసారం, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి ఆకస్మికంగా తనిఖీలు జరిపారు. హోటల్స్ అపరిశుభ్రత గమనించి శుభ్రంగా ఉంచాలని లేనిచో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వారి దగ్గర నుంచి శాంపిల్స్ సేకరించి హైదరాబాదులోని టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించారు. సేకరించిన ఆహార శాంపుల్స్ కల్తీ అని తేలినట్లయితే దాని ఆధారంగా చట్టపరమైన చర్యలు ఉంటాయని ప్రజలకు అందించే ఆహారపదార్థాలు కల్తీ లేకుండా ఆరోగ్యకరంగా ఉండాలని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్ హెచ్చరించారు.

# గ్రామీణ ప్రాంత తపాలా ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి




వలిగొండ, మేజర్‌న్యూస్ : మండల కేంద్రంలోని తపాలా శాఖ కార్యాలయం ఆవరణలో గురువారం దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో పని చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం నియమించిన కమలేష్ చంద్ర కమిటీ సిఫారసు చేసిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వలిగొండ ఎస్ఓ కింద పనిచేస్తున్న ఉద్యోగులందరూ పాల్గొని వలిగొండ ఎస్ ఓ ముందు సమ్మె చేస్తున్నారు ప్రభుత్వం వెంటనే సమస్యలను సీనియారిటీని, ఇంక్రిమెంట్లను 12,24,36 సంవత్సరాల సర్వీస్ ఉన్నవారికి మంజూరు చేయాలని జిడీఎస్‌లకు వైద్య సదుపాయం సంవత్సరానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని మరియు రిటైర్మెంట్ గ్రాట్యుటీ సెవరెన్స్ అమౌంట్‌ను రూపాయలు 1,50,000 ఉన్న దానిని రూపాయలు 3,00,000 పెంచాలని ఆచరణ సాధ్యం కానీ టార్గెట్లను వెంటనే ఆఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ మూడవరోజు వలిగొండ ఎస్ఓ ముందు సమ్మెలో పాల్గొన్నారు తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ సమ్మెలో పాల్గొన్న నాయకులు పలు సం బిక్షపతి మైసొల్ల శంకర్ మైసొల్ల లక్ష్మీనర్స్ రవ్వ మల్లేశం చినపాక క్రాంతి కుమార్ జూలు శంకరయ్య పులిపలుపుల శ్రీనివాస్ తదితర ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు.

# ఘనంగా హనుమంతు సార్ జన్మదిన వేడుకలు



చింతపల్లి, మేజర్‌న్యూస్ : మాల్ వెంకటేశ్వర్ నగర్‌లోని భారతి జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతు సార్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ప్రసాద్ గౌడ్, వేణు, ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

# ఆలయంలో విశేష పూజలు




యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో గురువారం నిత్య ఆరాధనలు శాస్త్ర యుక్తంగా సాగాయి. హరిహరులను ఆరాధిస్తూ మొక్కులు చేపట్టారు. వేకువజామున సుప్రభాతం చేసి పూజారులు హారతి నివేదించారు. ఉత్సవ మూర్తులకు అభిషేకించి అర్పించారు. వేదమంత్రాలతో ప్రధానాలయంలో సుదర్శన నారసింహ హెూమం చేపట్టారు. విశ్వక్సేన ఆరాధనతో నారసింహ కళ్యాణం చేశారు. చరమూర్తుల మందిరంలో రామలింగేశ్వర స్వామిని కొలుస్తూ అభిషేకం చేశారు. పాత గుట్టలో నిత్యారాధనలు కల్యాణోత్సవ పర్వాలు జరిగాయి.

## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి నియోజకవర్గంలో

# ఒక్క బెల్టు షాపు లేకుండా చేస్తాననడం హర్షనీయం

## అర్థ వెంకటరెడ్డి



చౌటుప్పల్, మేజర్‌న్యూస్ : మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చౌటుప్పల్ మండలంలో ఉన్న కాలుష్యకారక కంపెనీలపై తగిన చర్యలు తీసుకుంటామని, మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా బెల్టు షాపులను లేకుండా చేస్తారని హామీ ఇచ్చినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చౌటుప్పల్ చౌటుప్పల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్థ వెంకటరెడ్డి అన్నారు. గురువారం పత్రిక ప్రకటన ద్వారా వారు తెలియజేస్తూ మునుగోడులో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఇచ్చారని మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తీసుకొని వచ్చి అభివృద్ధి చేస్తానని రాజగోపాల్ రెడ్డి చెప్పడంతో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. చౌటుప్పల్ మండలం కాలుష్య కోరల్లో చిక్కుపోయి భావితరాలకు ప్రశ్నార్థకంగా మారిందని,బెల్టు షాపుల వల్ల యువత చిన్న వయసులోనే ప్రాణాపాయ స్థితికి చేరుతుండడంతో వీటి రెండిటి పై తక్షణమే చర్యలు చేపడతానని హామీ ఇవ్వడంతో ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. నిత్యం బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు శాసనసభ్యుడుగా ఎన్నికైనందుకు ఈ సందర్భంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# సర్పంచ్ ఎన్నికల బరిలో బీఎస్పీ

## – తగరం సుభాష్ చంద్రబోస్




చౌటుప్పల్, మేజర్‌న్యూస్ : రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో చౌటుప్పల్ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి బీఎస్పీ అభ్యర్థులు బరిలో నిలవనున్నారని బీఎస్పీ చౌటుప్పల్ మండల అధ్యక్షుడు తగరం సుభాష్ చంద్రబోస్ అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కంటే మండల వ్యాప్తంగా బీఎస్పీ పార్టీ గ్రామాల్లో విస్తరించిందన్నారు. బీఎస్పీ పార్టీ నుంచి గ్రామ సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి గ్రామంలో గ్రంథాలయం, నిరుద్యోగులకు ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ సాండిల్స్ అందచేసిన దివిస్ లేబొరేటరీస్



వలిగొండ, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని గోకారం జాలు కాలువ గ్రామాలలోని జిల్లా పరిషత్ మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం స్కూల్ బ్యాగ్స్ సాండిల్స్ గ్రామాల సర్పంచులు తుర్కపల్లి మాధవి సురేందర్ మద్దెల సందీప్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ సంస్థ వారు గ్రామాల అభివృద్ధి కోసం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నారని కొనియాడారు. గ్రామ అభివృద్ధికి విద్యాభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందిస్తున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యాదయ్య, పంచాయతీ కార్యదర్శి అపర్ణ, దివిస్ సిఎస్ఆర్ ఇన్‌చార్జి వల్లూరి వెంకట్, రాజ్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

## శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో

# అయ్యప్ప మాలదారులకు అన్నదానం



చౌటుప్పల్, మేజర్‌న్యూస్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో శ్రీ అయ్యప్ప స్వామి మాలదారుల నిత్య అన్నదానం కార్యక్రమం లో భాగంగా గురువారం అయ్యప్ప మాలదారులకు భక్తులు బొజ్జ యాదగిరి – మార్తమ్మ దంపతులు మాలదారులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మాలదారులకు అన్నదానం చేయడం మా పూర్వజన్మ సుకృతం అన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు చెరుకు అశోక్ గౌడ్, తొర్పునూరి నర్సింహ గౌడ్, సవుడోజు మల్లేష్ చారి, కళ్లెం నాగరాజు గౌడ్, చేవగొని మహేష్ గౌడ్, బత్తుల మల్లేష్ గౌడ్, చెరుకు రాము, వంగూరి శ్రీను, కొత్తోజు వెంకట్ చారి, పొల్దాస్ రాజేష్, చేవగొని గణేష్, తొర్పునూరి రవి గౌడ్, సన్నిదానం స్వాములు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయములో నిత్య అన్నదాన



కార్యక్రమములో భాగంగా గురువారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం కోగంటి సూర్యచంద్ – సుష్మా దంపతులు ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మాలధారులకు అన్న దానము నిర్వహించడము మా పూర్వజన్మ సుకృతం అన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయం అధ్యక్షులు కామిశెట్టి భాస్కర్, మాజీ అధ్యక్షులు బొబ్బిళ్ళ మురళీ గురుస్వామి, తూర్పాటి శంకర్ గురుస్వామి, చింతల సాయిలు, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, తాడూరి పరమేష్, ఉప్పు ఆంజనేయులు, సుక్క సుదర్శన్, డాక్టర్ సుమన్ కళ్యాణ్, పెద్దగొని రమేష్ గౌడ్, అంతటి రాము, గుత్తికొండ సుధీర్, తొర్పునూరి నాగరాజు, పల్సాం రాజేష్, మాదాని సంపత్, జిట్ట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### కొండమడుగు మెట్టు వద్ద

## యాదాద్రి కో ఆపరేటివ్ బ్యాంక్ ఏటీఎం ప్రారంభం



బీబీనగర్, మేజర్‌న్యూస్ : మండలంలోని కొండమడుగు మెట్టు వద్ద యాదాద్రి కో ఆపరేటీవ్ సోసైటీ బ్యాంక్ ఏటీఎంను చైర్మన్ కొలను శ్రీనివాస్,మాజీ పీఎసీఎస్ చైర్మన్ వాకిటి సంజీవ రెడ్డిలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదాద్రి జిల్లా వ్యాప్తంగా కో-ఆపరేటివ్ బ్యాంక్ సేవలు విస్తరించేందుకు అంచలంచెలుగా చర్యలు తీసుకుంటున్నామని ఇందులో భాగంగా ప్రజలు డబ్బులు డ్రా చేసుకోవడానికి యాదాద్రి కో-ఆపరేటివ్ బ్యాంక్ ఏటీఎంను అందుబాటులోకి తెచ్చామన్నారు. యాదాద్రి కోఆపరేటివ్ బ్యాంక్‌లో అన్ని రకాల రుణాలు తీసుకుని లబ్ది పొందాలని సూచించారు. యాదాద్రి కోఆపరేటివ్ సోసైటీ బ్యాంక్ సేవలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గొసుకొండ సంజీవరావు,సీఈఓ గొలనుకొండ రాంబాబు, సిబ్బంది కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప సేవ, హనుమాన్ శక్తి జాగరణ మహా పడిపూజ మహోత్సవం

### 41 రోజుల అన్నదానం ముగింపు

### ముఖ్య అతిథి ముసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి



హాలియా, మేజర్‌న్యూస్ : అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం, హనుమాన్ శక్తి జాగరణ సమితి ఆహ్వానం మేరకు మహా పడిపూజ మహోత్సవమునకు విచ్చేసిన బుసిరెడ్డి పాండురంగారెడ్డి దంపతులు నల్గొండ జిల్లా, నాగార్జునసాగర్ నియోజకవర్గం, అనుముల మండలం, హాలియ మున్సిపాలిటీ నందు రామాలయంలో అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం మరియు హనుమాన్ శక్తి జాగరణ సమితి ఆహ్వానం మేరకు మాన్యశ్రీ అఖండ నిష్టాపరులు శ్రీ శ్రీ శ్రీ అరుణ్ గురుస్వామి దివ్య ఆశీస్సులతో, ధీక్షలో వున్న అయ్యప్పస్వాములు 41 రోజుల అన్నదాన కార్యక్రమం ముగింపు సందర్భంగా దాతలను సత్కరించే కార్యక్రమంలో భాగంగా గురువారం బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి దంపతులని ఘనంగా సన్మానించడం జరిగింది. తదనంతరం స్వాములు మహా పడిపూజ కార్యక్రమము అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ మండలం వైస్ యంపిపి యడవల్లి దిలీప్ రెడ్డి, తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, మేడిపల్లి మోహన్ రావు, రాయప్రోలు మురళి కృష్ణ, రేపాల వెంకన్న, మైనారిటీ సెల్ అధ్యక్షుడు నయీమ్ పాష,వివియస్ ప్రసాద్, కాకునూరి శ్రీను, కాకునూరి నారాయణ, జడ మణికంత, ఇస్రం లింగస్వామి, అనుముల కోటేష్, గజ్జల నాగార్జున రెడ్డి, గడ్డం సజ్జన్, అబ్దుల్ కరీం, కొంపల్లి మూడవ వార్డు మెంబర్ జినకల యాదయ్య, మధు, గాలి నరేందర్ రెడ్డి, స్వాములు చందా అంజిరెడ్డి, అల్లుల పూజిత శ్రీనివాస రెడ్డి, గౌరు శ్రీనాథ్, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మందుల సామేల్‌ను కలిసిన మండల నాయకులు



నూతనకల్, మేజర్‌న్యూస్ : తుంగతుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు మందుల సామేల్‌ను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీగల గిరిధర్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు తీగల మల్లారెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండల నాయకులు హైదరాబాదులోని వారి నివాసంలో కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండలంలో నెలకొని ఉన్న సమస్యల గురించి వివరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాబాది వాసుదేవరెడ్డి, భీమిడి నారాయణ రెడ్డి, యుద్ధం రెడ్డి, ఏలేటి సత్తి రెడ్డి, గుర్రం ఎంకన్న, సొప్పరి ఏసు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వేముల వీరేశం



రామన్నపేట, మేజర్‌న్యూస్ : నూతనంగా రెవిన్యూ, గృహ నిర్మాణం శాఖ మంత్రిగా ప్రమాణం చేసిన పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డిని, గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సిరిగి రెడ్డి మల్లారెడ్డి, నాయకులు గంగుల వేంకట్ రాజీ రెడ్డి, పూస బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఓపెన్ ఫోరం




రామన్నపేట, మేజర్‌న్యూస్ : మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో గురువారం మండల మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈసందర్భంగా,1-5-2022, నుండి,31-3-2023 వరకు మండలంలోని వివిధ గ్రామాలలో ఉపాధి హామీ పథకంలో కూలీల పనులు,వేతనలపై, నిర్వహించిన పనులపై సమగ్రంగా చర్చ జరిగింది. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ పున్న లక్ష్మీ జగన్మోహన్, ఎంపిడిఓ,గాదె జలెందర్ రెడ్డి,ప్రెసిడింగ్ ఆఫీసర్, శ్యామల, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్, చండీ రాణీ, అసిస్టెంట్ విజిలెన్స్ మేజర్, అధిత్యనాథ్, ఎస్‌టిఎం, అంజలీ దేవి, ఎస్ ఆర్ పి, రజిత,ఏపిఓ పున్న వెంకటేశం, సర్పంచులు, ఉప్పు ప్రకాష్, కడమంచి సంధ్య స్వామి, ఎంపిటిసి సభ్యులు పూస బాలమణీ నర్సింహా,మాదూరి జ్యోతి రామచంద్ర రావు, మండలంలోని వివిధ గ్రామాల గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టీసిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సోషల్ ఆడిట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్లో అధిక స్థానాలు యాదవులకు కేటాయించాలి



చివ్వెంల, మేజర్‌న్యూస్ : త్వరలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో యాదవులకు అన్ని పార్టీలు అధికర స్థానాలు కేటాయించాలని గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అఖిల భారత యాదవ్ వంశ మహాసభ జిల్లా అధ్యక్షులు లింగంపల్లి మధుకర్ యాదవ్ అన్నారు. మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లో యాదవులకు అన్ని పార్టీలు మోసం చేశాయని, జనాభా శాతం ప్రకారం యాదవులకు అన్ని ప్రార్టీలు టిక్కెట్లు కేటాయించక పోవడం చాలా బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా యాదవుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయకుండా, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం మంత్రివర్గంలో యాదవులకు సముచిత స్థానం కల్పించాలని అన్నారు. ఈ నయా ప్రభుత్వం యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అశోకు యాదవ్, శంకర్ యాదవ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ఘనంగా ఆలంపల్లి జన్మదిన వేడుకలు



దేవరకొండ, మేజర్‌న్యూస్ : దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ జన్మదినోత్సవాని పురస్కరించుకొని ఈరోజు దేవేంద్రన్న యువసేన ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృదుస్వభావి, నిగర్వి అయిన నర్సింహ గొప్ప క్రమ శిక్షణతో రాజకీయంగా, సామాజికంగా అంచలంచలుగా ఎదుగుతూ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. నిత్యం ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రజాసేవ పరమావధిగా జీవిస్తూ రాజకీయాలలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. వివిధ స్థాయిలలో ప్రజా ప్రతినిధిగా పనిచేస్తూ దేవరకొండ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. నేటి తరం యువ రాజకీయ నాయకులు ఆయన వ్యక్తిత్వం నుంచి అనేక పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి దేవరకొండ అభివృద్ధికి మరింత పాటుపడాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జానియాదవ్, వైదొనివంపు సర్పంచ్ పాపమ్మ, సీనియర్ జర్నలిస్టు కరుణాకర్, విజయ్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

## 16న రామన్నపేటలో విద్యుత్ గ్రీవెన్స్ డే

రామన్నపేట, మేజర్‌న్యూస్ : విద్యుత్ వినియోగదారుల సమస్యలపై రామన్నపేట పట్టణ కేంద్రంలోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 16వ తేదీ రోజున సీజీ ఆర్‌ఎఫ్ (కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రేసాల్ ఫోరం) ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు. రామన్నపేట ఏడీఈ సీహెచ్.నరేష్ కుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారానికి హాజరయ్యే వినియోగదారులు ఆధార్ కార్డు, కరెంటు బిల్లు రసీదు తీసుకురావాలని చెప్పారు. 16వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. రామన్నపేట సబ్ డివిజన్ పరిధిలోని రామన్నపేట, వలిగొండ మండలాల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏడిఈ, సీహెచ్, నరేష్ కోరారు.

# ఘనంగా సామినేని రమేష్ జన్మదిన వేడుకలు



కోదాడ, మేజర్‌న్యూస్ : కాంగ్రెస్ పార్టీ నాయకుడు సామినేని రమేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ప్రమోద్ రెడ్డి, నాగిరెడ్డి, సుందరి వెంకటేశ్వర్లు, నరేష్, షరీఫ్, బాబీ, రాజేష్ పాల్గొన్నారు.

# సన్నిధానంలో అన్నదానం

## మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్రా సుధారాణి పుల్లారెడ్డి దంపతులు





కోదాడ, మేజర్ న్యూస్ : హుజూర్‌నగర్ రోడ్డులోని గాలి రమేష్ నాయుడు జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న సన్నిధానంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీవీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బుర్రా సుధారాణి పుల్లారెడ్డి దంపతుల సహకారంతో అన్నదానం చేశారు. సుమారు 500 మంది అయ్యప్ప స్వాములకు అన్నదానం చేసినట్లు వివరించారు. బుర్రా సుధారాణి పుల్లారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. గాలి శ్రీనివాస్ నాయుడు, సీతారాంసింగ్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

# బస్సు సర్వీసులను పెంచాలి

శాలిగౌరారం, మేజర్‌న్యూస్ ః నల్లగోండ నుండి మనిమద్దె వరకు నడుపుతున్న బస్ సర్వీస్‌లను పెంచాలని బైరోని బండ సర్పంచ్ దండ రేణుక అశోక్ రెడ్డి అన్నారు. గురువారం నల్లగోండ ఆర్‌టీసీ రీజినల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కరోనా కారణంగా బస్సు ట్రిప్పులను తగ్గించడం ద్వారా ఈదులూరు, తక్కెలపహడ్, బైరోని బండ, ఎన్‌జీ కోత్తపల్లి గ్రామాల ప్రయాణికులు, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణానికి బస్సులు పెంచాలని కోరారు.



# విద్యార్థుల రాజకీయ పార్టీ నల్లగొండ జిల్లా ఇన్చార్జిగా నూనె సురేష్



దేవరకొండ, మేజర్‌న్యూస్ ః దేవరకొండ మండలం తూర్పుపల్లి గ్రామానికి చెందిన నూనె సురేష్ ని విద్యార్థుల రాజకీయ పార్టీ (విఆర్పి) నల్లగొండ జిల్లా ఇన్చార్జి విఆర్పి రాష్ట్ర అధ్యక్షులు యెచ్చు సునిల్ నియమించారు. ఈసందర్భంగా విఆర్పి నల్లగొండ జిల్లా నూతన ఇన్చార్జి నూనె సురేష్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలు పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించటం జరుగుతుంద న్నారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగానికి సాగు నీరు ఇవ్వాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకు ఉచిత విద్య వైద్యం కల్పించాలని కోరారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బలమైన ఉద్యమాలను ఉదృతం చేస్తామని ఆయన చెప్పారు. నల్లగొండ జిల్లా ఇన్చార్జి గా తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు యేచ్చు సునీల్, రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు.

# సిఎంసిఓను కలిసి ఘనంగా సన్మానించిన వెంకటేష్ గౌడ్



తుర్కపల్లి, మేజర్‌న్యూస్ ః టిపిసిసి అధికార ప్రతినిధి బోరెడ్డి అయోధ్య రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సిపి ఆర్ ఓ గా నియమితులైన సందర్భంగా తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్ గురువారం ఆయనను హైదరాబాద్ లోని సచివాలయం లో కలిసి శాలువాలు పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబం నుండి జర్నలిస్టుగా విధులు నిర్వర్తించి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తూ నేడు సిఎం సిపి ఆర్ ఓ గా బాధ్యతలు చేపట్టడం గొప్ప విషయమని అభి వర్ణించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయన వెంట సిరిగిరి విద్యాసాగర్, పలుగుల నరేందర్, కోట సురేష్, బండారి శ్రీను, నల్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత పరిశ్రమ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి



మోత్కూర్, మేజర్‌న్యూస్ ః తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికైన కొత్త ప్రభుత్వం చేనేత పరిశ్రమ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాశికంటి లక్ష్మినర్సయ్య కోరారు. మోత్కూరు మున్సిపాలిటీ ప్రవేశపెట్టిన, చేనేత మిత్ర, చేనేతకు చేయూత, చేనేత భీమా పథకాలను కొనసాగిస్తూ, చేనేత సహకార వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. రాష్ట్రంలో చేనేత సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించి, సంఘాల ద్వారా చేనేత కార్మికులకు పని కల్పించి, పథకాలను అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి పోచం కన్నయ్య చేనేత కార్మికులు జల్ది సోమయ్య, గుర్రం అంబదాస్, దోర్నాల మత్స్యగిరి, కందుల వెంకన్న, వల్లకాటి శ్రీను, పోచం విమలమ్మ, పోచం సత్యలక్ష్మి, దోర్న స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

# సెమీ క్రిస్మస్ వేడుకలు





కోదాడ రూరల్, మేజర్ న్యూస్ : రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బిల్డింగ్ ఆవరణలో హోలీ గాస్పల్ ఫైర్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ సైమన్, కలపాల ప్రకేష్ హాజరై క్రీస్తు సందేశాన్ని భక్తులకు అందించారు. క్రీస్తు బోధనలు ఆచరణీయమన్నారు. సువార్త బైబిల్‌లోని మత్తై, మార్క్, లూకా, యోహాన్ పాఠాలు చదివి ఆచరించడం ద్వారా పరలోక రాజ్యాన్ని చేరవచ్చున్నారు. అబ్రహం, పంది తిరపతయ్య, ముత్యాలు, పాస్టర్లు మహేష్, బాలు, పీటర్, రాము, అక్షయ్, దినేష్, పాస్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

**కోదాడ టౌన్ :** బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ వి ఏసయ్య ఆధ్వర్యంలో జేవీఎస్ బజార్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఏసుక్రీస్తు బోధనల ద్వారా పరలోక రాజ్యాన్ని చేరుకోగలుగుతామన్నారు. క్రిస్టియన్ కో ఆప్షన్ సభ్యురాలు జానకి ఏసయ్య, బొల్లికొండ కోటయ్య, జాన్, సైదా నాయక్, విజయ, శార రాణి, మౌనిక, సీత, జ్యోతి, కోటేశ్వరి, శివ, రాంబాబు, వెంకీ, మోజెస్, సునీత పాల్గొన్నారు.







# మౌన యుద్ధం మనిషి మిన్న

తిప్పర్తి, మేజర్‌న్యూస్ ః మనిషికన్నా మనిషి మాటకున్న విలువ మిన్న మనుషుల మధ్య మాటలకున్న విలువ మరీ మిన్న మనుషుల మధ్య మాట కరువైనవుడు శ్మశాన నిశ్శబ్దం రాజ్యమేలుతుందిపభ్రుత్వానికీ ప్రజలకూ మధ్య మాట కరువైనవుడు రాజ్యమే ఒక శ్మశానాన్ని తలపిస్తుంది- అవును! ఇప్పుడు కాశ్మీర్‌లో అదే జరుగుతోంది. ఉగ్రవాదానికి-కేంద్రానికి మధ్య అంటూ మొదలైన యుద్ధం ఇప్పుడు కేంద్ర పాలక పార్టీకి - కాశ్మీర్‌లోని ప్రజాస్వామ్య పార్టీలకూ మధ్య కేంద్రీకృా ఎతమైంది. ఫలితంగా కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ముగ్గురూ చెరసాలలో మగ్గుతున్నారు. భారతదేశ చరిత్రలో కనీవినీ ఎరుగుని విపరీతమిది. తలచుకుంటేనే వొళ్లంతా జలదరించే అనూహ్యామైన అప్రజాస్వామిక పరిణామమిది. మరీ ముఖ్యంగా భారతదేశ జాతీయజెండా కాశ్మీర్‌లో సగర్వంగా ఎగిరేందుకు జీవితాంతం చావుకు ఎదురీది శ్రమించిన 81ఏండ్ల కురువృాఎద్ధుడు, మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లాను అరెస్టు చేయడం. ఫరూఖ్ అబ్దుల్లా విషయంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పరమ దుర్మార్గమైనది. ఆర్టికల్ 370ని రద్దు చేసిన ఆగస్టు 5 నుంచే ఫరూఖ్‌ను గృాఎహనిర్బంధంలో ఉంచారు.

సూర్య



# జీఎస్టీ

నార్కట్‌పల్లి, మేజర్‌న్యూస్ : జీఎస్టీ అమలుతో పేదలకు లాభం జరుగుతుందని చెప్పిన మోడీ అమెరికాలో 20 టాప్ కంపెనీల సీఈఓల సమావేశంలో వస్తుసేవల పన్ను సంస్కరణలు చేశామనీ, భారత పన్నుల విధానం అమెరికా బిజినెస్ పాఠశాలల్లో పాఠ్యాంశంగా చేర్చవచ్చునని ప్రచారం చేస్తున్నారు. మనదేశ భక్తులు బడుగుల నెత్తిమీద చెయ్యిపెట్టి బడా కార్పొరేట్ సంస్థలకు స్వాగతం పలుకుతున్నారు. మోడీ ద్వంద్వ నీతి బట్టబయలైంది.

కేంద్ర ప్రభుత్వం వస్తుసేవల పన్ను ప్రారంభాన్ని ఒక పెద్ద ఘనకార్యంగా భావిస్తోంది. కేంద్ర పన్నుల విధానానికి వ్యతిరేకంగా వస్త్ర వ్యాపారులు బంద్ పాటించారు. వివిధ రకాల నిరసనలు తెలుపుతున్నారు. వస్త్ర పరిశ్రమలో వెయ్యి రూపాయలు విలువగల వస్త్రాలు కొంటే ఒక పన్ను విధానం, దాటితే మరొక పన్ను విధించటం వల్ల పన్నులు భారంగా పరిణమించనున్నాయి. ముఖ్యంగా చేనేత వస్త్రాల ఉత్పత్తి ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి జీఎస్టీ భారంతో చేనేతరంగం మరింత రక్షణ లేకుండాపోయే ప్రమాదం ఉంది. బీడీ పరిశ్రమ దివాళా తీసి లక్షలాదిమంది బీడీ కార్మికులు ఉపాధిలేక రోడ్డున పడతారు. పాత పన్నుల విధానంలో 18శాతం పన్ను చెల్లిస్తున్నారు. ఇప్పుడు 28శాతానికి పెరగడం వలన అమ్మకాలు పడిపోతాయి. పరిశ్రమలు మూతపడతాయి. కాబట్టి బీడీ పరిశ్రమను జీఎస్టీ నుండి మినహాయించాలనే కోరిక సమంజసమైనదే. ఒకప్పుడు పాలకులు చిన్న పరిశ్రమలను పెద్ద పరిశ్రమల పోటీ నుండి కాపాడేందుకు ప్రత్యేకమైన పన్ను రాయితీలు ఇచ్చేవారు. ఇప్పుడు టర్నోవర్‌ను నామమాత్రంగా పెంచి పన్ను భారాల నుండి మినహాయింపు లేకుండా చేశారు. పన్నుల భారం, కార్పొరేట్ సంస్థల పోటీ తట్టుకోలేక పరిశ్రమలు మూతపడతాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. మరొకవైపు జీఎస్టీ అమలు వలన లక్షల ఉద్యోగాలు వస్తాయని ఊదరగొడుతున్నారు. పాలకులు నిరుద్యోగులను భ్రమలకు గురిచేస్తున్నారు.

దేశంలో ఇప్పటికి 60శాతం మందికి పైగా వ్యవసాయం మీద ఆధారపడి పనిచేస్తున్నారు. ఈ రంగం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. పంటలకు గిట్టుబాటు ధరలు రాక అన్నదాతలు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జీఎస్టీ వ్యవసాయ రంగాన్ని కూడా విడిచిపెట్టలేదు. గతంలో అన్ని రకాల ఎరువుల మీద వ్యాట్ 5శాతం మాత్రమే ఉండేది. వస్తుసేవల పన్నులు అమలు అయితే అదనంగా 7శాతం పన్ను పెరుగుతుంది. అదే స్థాయిలో ఎరువుల ధరలు కూడా పెరుగుతాయి. క్రిమి సంహారక మందుల మీద 18శాతానికి పన్నులు పెరుగుతాయి. గోరుచుట్టుపై రోకటిపోటులాగా ఇప్పుడు జీఎస్టీ పన్నుల వలన రైతు నెత్తిన అప్పులు పెరుగుతాయి. ప్రజలెవ్వరూ కోరకుండా పన్నుల విధానాలలో పాలకులు మార్పులు ఎందుకు చేస్తున్నారు? అసలు దేశమంతా ఒకే పన్ను పద్ధతి పాటించాలని ఎవరు బలవంత పెట్టారు? కేంద్ర పాలకులు కార్పొరేట్ శక్తుల పంచన చేరారు. ముందు రిటైల్ రంగంలో సంస్కరణలు చేశారు. వాల్‌మార్ట్ లాంటి సంస్థలకు స్వదేశీ గుత్త సంస్థలకు తలుపులు తెరిచారు.

కార్పొరేట్ పంజరంలో చిక్కిన అధికార పార్టీ చిలుకలు ఒకే దేశం ఒకే పన్ను ఉండాలనే చిలుక పలుకులు పలికారు. ప్రజలకు లాభం జరుగుతుందని ప్రచారం చేశారు. ఏకాభిప్రాయ సాధన పేరుతో అనేక ప్రయత్నాలు చేసి, పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ ద్వారా ఒకే పన్ను ఆమోదింపజేసుకున్నారు. ఫెడరల్ వ్యవస్థపై వేటు వేశారు. గతంలో పన్నుల వ్యవస్థ కేంద్రం చేతిలో ఉండాలా రాష్ట్రం చేతిలో ఉండాలా అని రాజ్యాంగ నిర్మాతలు చర్చించి ప్రత్యక్ష పన్నులు కేంద్రం, పరోక్ష పన్నులు రాష్ట్రాలకు హక్కు భుక్తం చేశారు. ఒకే పన్ను విధానం రావడంలో కేంద్రం ముందు రాష్ట్రాలు సాగిలపడే పరిస్థితి వచ్చింది. వస్తుసేవల పన్నును నిర్ణయించడానికి జీఎస్టీ కౌన్సిల్ ఏర్పడింది. గతంలో పరోక్ష ప్రత్యక్ష పన్నుల వసూలు ఉండేది. ఇప్పుడు మొత్తం పన్నులను మూడు కేటగిరీలుగా విభజించి పన్నులు వేయాలని నిర్ణయించారు. జీఎస్టీ సమావేశానికి హాజరైన రాష్ట్ర మంత్రి తారక రామారావు కొత్తపట్టం వలన రూ.11వేల కోట్ల భారం తెలంగాణపై పడుతుందని తెలిపారు. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఇన్ని భారాలు పడితే దేశ ప్రజలపై ఎంత భారం పడుతుందో తలుచుకుంటేనే కడుపు తరుక్కుపోతోంది. ముందూ వెనకా ఆలోచించకుండానే టీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రం అడిగిందే తడవుగా జీఎస్టీని ఆమోదించిన ఫలితంగా ప్రజలపై పెద్ద ఎత్తున భారాలు పడుతున్నాయి. వస్తుసేవల పన్ను విధానంలో మార్పులు జరగాలంటే కేంద్రానికి ఇష్టం లేకుండా ఏదీ జరగదు. కౌన్సిల్‌లో 75శాతం మంది ఆమోదిస్తేనే అమలు జరుగుతుంది. కానీ మొత్తం రాష్ట్రాల ఓటు విలువ 66.6శాతం మాత్రమే. అందుకే టీఆర్ఎస్ ప్రభుత్వం చేతిలో ఉన్న హక్కును పోగొట్టుకొని, బీడీ పరిశ్రమకు మిషన్ భగీరథకు పన్ను మినహాయించాలని కోరడం అత్యంత విచారకరం. జీఎస్టీ అమలు కాకముందే రాష్ట్రాల మీద కేంద్రం పెత్తనం పెరిగింది. భవిష్యత్‌లో ఇంకా పెరుగుతుంది. తెలంగాణలో పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేశామని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వాస్తవాలు ఏమిటో బయటపెట్టారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏంలాభం? జీఎస్టీ అమలుతో పేదలకు లాభం జరుగుతుందని చెప్పిన మోడీ అమెరికాలో 20 టాప్ కంపెనీల సీఈఓల సమావేశంలో వస్తుసేవల పన్ను సంస్కరణలు చేశామనీ, భారత పన్నుల విధానం అమెరికా బిజినెస్ పాఠశాలల్లో పాఠ్యాంశంగా చేర్చవచ్చునని ప్రచారం చేస్తున్నారు. మనదేశ భక్తులు బడుగుల నెత్తిమీద చెయ్యిపెట్టి బడా కార్పొరేట్ సంస్థలకు స్వాగతం పలుకుతున్నారు. మోడీ ద్వంద్వ నీతి బట్టబయలైంది.

# బతకాలంటే యుద్ధం చేయాలా ?

త్రిపురారం, మేజర్‌న్యూస్ : ఏలికలకు రైతులు అక్కరలేదేమో...! కానీ ఈ దేశానికి రైతులు కావాలి... భూమిని బువ్వగా మార్చి ప్రజల ఆకలి తీర్చడానికి ఈ దేశానికి రైతులు కావాలి. అందుకు వారికి భూమి కావాలి... సాగుకు సాయం కావాలి. నెత్తురు చెమటగా చేసి, సత్తువ ధారపోసి మన్నును అన్నంగామించే వ్యవసాయం వారికి ఫలసాయం కావాలి.... మన ఏలికలకు రైతులు అక్కరలేదు కానీ, రైతుకు ఆధారమైన భూమి కావాలి. భూమి మీద గాలి, నీరు, మట్టితో పాటు భూమి తన గర్భంలో దాచుకున్న అనంతమైన సంపద కావాలి. ఎవరి కోసం..? ప్రజల కోసమే అనుకుంటే పొరబాటు..! కంపెనీల కోసం... కంపెనీల యజమానుల కోసం..!! ఎందుకంటే వారి సేవకే ఈ ప్రభుత్వాలు. ఇవి పైకి ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలుగానే కనిపిస్తాయి. కానీ ఇవి కార్పొరేట్లు కోరుకున్న ప్రభుత్వాలు. వీరు తలచుకుంటే అమెరికాలో నిలువెల్లా జాత్యహంకారంతో నిండిన ట్రంప్‌నైనా అధ్యక్షుడిని చేయగలరు, ఇండియాలో గుజరాత్‌ను రక్తసిక్తం చేసిన మోడీనైనా ప్రధానిని చేయగలరు. కానీ అక్కడ ట్రంపైనా, ఇక్కడ మోడీ అయినా సేవలు చేయవలసింది ఈ కార్పొరేట్ కంపెనీలకే... వారి కృపాపి మొత్తం ప్రకృతి సంపదను, మానవ శ్రమను కొల్లగొట్టి వీరికి కట్టబెట్టడానికే. ఇప్పుడు ప్రపంచమంతటా జరుగుతున్న ఈ తతంగమే దేశంలోనూ జరుగుతున్నది. మన రాష్ట్రంలోనే కాదు దేశమంతటా రైతుల్లో చెలరేగుతున్న అసంతృప్తి జ్వాలలన్నీ దీనికి సూచికలే..!

దిక్కుతోచక రైతులు పంటలను తగుల బెట్టుకోవడం, మార్కెట్ యార్డుల వద్ద ధర్నాలు చేయడం మాత్రమే చూసిన దేశానికి తొలిసారిగా 'సమ్మె' సెగను చూపించారు మహారాష్ట్ర రైతులు. లక్షలాది లీటర్ల పాలను బజారులో పారించి, టన్నుల కొద్ది కూరగాయలను వీధుల్లో కుమ్మరించి, వేలాది గేదెలతో రహదారులను దిగ్బంధనం చేసి ప్రభుత్వానికి దిమ్మతిరిగేలా చేశారు మధ్యప్రదేశ్ రైతులు. విశ్లేం చేస్తారులే అన్న అధికారుల అలసత్వానికి, ప్రభుత్వ అహంకారానికి తిరుగుబాటు రుచి చూపించారు తెలంగాణ రైతులు. వీరందరికంటే ముందు మోడీ స్వరాష్ట్రంలోనే ఈ పోరాటాలకు శ్రీకారం చుట్టారు గుజరాత్ రైతులు. దేశం నడిబొడ్డున మన ప్రభుత్వాల చేతకాని తనాన్ని ఎలుగెత్తి చాటారు తమిళ రైతులు. కానీ మన ప్రభుత్వాలేం చేస్తున్నాయి. ఆవేదన ఆవుకోలేక సమ్మెకు దిగిన రైతును నిర్దాక్షిణ్యంగా నిర్బంధించింది మహారాష్ట్ర ప్రభుత్వం. గుండె మంటను తట్టుకోలేక రోడ్డెక్కిన రైతుకు "తూపాకీ గుండ్ల"తో సమాధానం చెప్పింది మధ్యప్రదేశ్ ప్రభుత్వం. కడుపు మండి కండ్లు తెరిపించే ప్రయత్నం చేసిన రైతుకు సంకెళ్ళు వేసింది తెలంగాణ ప్రభుత్వం. ఇంతకీ వీరు చేసిన నేరమేమిటి..? ప్రభుత్వాలే ప్రకటించిన ఉచిత విద్యుత్, సాగునీరు కావాలన్నారు. రుణమాఫీని గుర్తుచేశారు. పాల ధరను పెంచమన్నారు. చేసిన కష్టానికి, పెట్టిన పెట్టుబడికి తగిన ధర అడిగారు. ప్రజాస్వామ్యంలో వారికి ఆ మాత్రం హక్కులేదా..? కాళ్ళకింద నేల కరిగిపోతుంటే, రెక్కల కష్టం నక్కల పాలవుతుంటే రైతులే చేయాలి పోరాడటం తప్ప...!

నేటికీ మనది వ్యవసాయ దేశం. 70శాతం మంది ప్రజలు వ్యవసాయం మీదే ఆధారపడి జీవిస్తున్నారు. ఆ ప్రజలనే పట్టించుకోని ఈ ప్రభుత్వాలేమనాలి. గతంలో రైతులకు చేతల్లో ఏమీ చేయకపోయినా కనీసం మాటల్లోనైనా రైతే దేశానికి వెన్నెముక అనీ, జై జవాన్.. జైకిసాన్.. అని నినదించేవారు ఏలికలు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వంలో ఆ మాత్రం ప్రస్తావన కూడా కనిపించకపోవడం ఈ ప్రభుత్వ వైఖరిని చెప్పకనే చెపుతోంది. అధికారంలోకి రాకముందు మేనిఫెస్టోల్లో తప్ప అధికారంలోకొచ్చాక రైతుల ఊసే మరిచిపోయారు. రైతులకు రుణమాఫీ అన్నారు. దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ అప్పనపడ్డ రైతులెందరు, రుణ విముక్తి కలిగించింది ఎందరికీ..? ప్రపంచంలోనే అత్యధిక ఉత్పత్తి చేసే మన మిర్చి రైతుల హాహాకారాలను ఎవరు పట్టించుకున్నారు...? వ్యవసాయ రంగంలోకి ప్రవేశిస్తున్న కార్పొరేట్ కంపెనీలకు, భూస్వాములకు, వాణిజ్య బ్యాంకుల ద్వారా వేల కోట్ల పంట రుణాలనిచ్చిన ఈ ప్రభుత్వాలు పేద రైతులను మాత్రం ప్రయివేటు రుణాల బారిన పడేసి ఆత్మహత్యల పాలు చేశాయి. దేశంలో 70శాతం ప్రజల జీవన్మరణ సమస్యను దాచిపెట్టి అభివృద్ధి గురించి మాట్లాడటం క్యాన్సర్ వుండుకు ప్లాస్టర్ వేయడమే.... అది గాయాన్ని కనిపించనీయదు కానీ మాన్పించలేదు కదా..!

అది తెలంగాణ కావొచ్చు, ఆంధ్రా కావొచ్చు, కేంద్రం కావొచ్చు... ఇలాంటి ప్రభుత్వాలన్నీ రైతును ఆత్మహత్య తప్ప గత్యంతరం లేని స్థితికి నెట్టి, వ్యవసాయాన్ని నిరుత్సాహపరచి భూమికి దూరం చేయడమే లక్ష్యంగా సాగుతున్నాయి. వివిధ శక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం రకరకాల పద్ధతుల్లో భూఆక్రమణే ఏకైక అజెండాగా కదులుతున్నాయి. ఈ తెర వెనుక కుట్రల ఫలితమే నేటి రైతాంగ సంక్షోభం. కానీ అంతిమంగా ప్రజలే నిర్ణేతలన్న విషయాన్ని నేతలు గుర్తుంచుకోవాలి. "భూమి గుండ్రంగా ఉంది. తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరగడం వలన పగలు, రాత్రి ఏర్పడుతున్నాయి" అని చెప్పినందుకు శాస్త్రవేత్తలకు మరణదండన విధించిన చరిత్ర మన పాలకవర్గాలది. ఎందుకంటే భూమి తమ చుట్టూ తిరగాలనీ, తమ గుప్పిట్లో ఒదగాలని వారి కోరిక.. కానీ అది సాధ్యమా..?

# ఇదేనా సుపరిపాలన ?

నడిగూడెం, మేజర్‌న్యూస్ : ఏలినవారి లీలలు రోజురోజుకీ వింత గొల్పుతున్నాయి. సుపరిపాలనకు తమను తామే ఓ నమూనాగా ప్రచారం చేసుకునేవాళ్ళు, అవినీతి అక్రమాలకు ఆమడదూరమని ప్రకటించుకునేవాళ్ళు, క్రమశిక్షణకు నిబద్ధతకు మారుపేర్లమని నీతులు బోధించేవాళ్ళు ఏపాటి పనిమంతులో ఆచరణలో పదేపదే రుజువవుతున్నది. వీరి విధానాల ఫలితంగా దగాపడిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించండి మొర్రో అంటూ వీధుల్లోకొచ్చి పోరాడుతుంటే విధులు మరిచిన నేతలు వింత వింత విన్యాసాలు చేస్తూ ప్రజలను, ప్రజా ఉద్యమాలను అపహాస్యం చేస్తున్నారు. దేశవ్యాపితంగా రైతాంగం ఆకలి చావులతో, ఆత్మహత్యలతో అల్లాడుతుంటే నేతలు యోగాసనాలు వేసుకోండి అంటూ సూక్తులు వల్లిస్తున్నారు. ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాలు రైతుల ఆగ్రహజ్వాలలతో మండుతుంటే అర్థంలేని దీక్షలు చేస్తూ నీరో చక్రవర్తులను తలపిస్తున్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి వినోదాల్లో తేలియాడుతున్నారు.

బీజేపీ పాలనలో దళితులు, ముస్లింలే కాదు, ఇప్పుడు రైతులు కూడా దేశ రాజకీయ చదరంగంలో పావులుగా మారుతున్నారు. అటు బీజేపీ గానీ, ఇటు టీఆర్ఎస్ గానీ స్వాభిమానంతో బతికే రైతును ప్రభుత్వాల సహాయం మీద ఆధారపడే స్థితికి దిగజార్చి వ్యవసాయాన్ని సంక్షోభంలో కొనసాగిస్తున్నాయి. ఓట్లు అవసరమైనప్పుడు రుణమాఫీ లంటున్నాయి. అవసరం తీరాక ఆ ఊసే మరిచిపోతున్నాయి. అంతెందుకు మన రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా అధికారం కోసం ఇద్దరు చంద్రులు రుణమాఫీలు ప్రకటించారు. కానీ అధికారం చేపట్టి మూడేండ్లు ముగుస్తున్నా ఆ రుణమాఫీ ఇంకా సాగుతూ...నే ఉంది..! అప్పట్లో దీనిని వ్యతిరేకించిన ప్రధాని నరేంద్రమోడీ ఉత్తరప్రదేశ్‌లో అధికారం కోసం ఇదే రుణమాఫీని ప్రజలకు వాగ్దానం చేశారు..!! ఇప్పుడేమో "రుణమాఫీ ఒక ఫ్యాషన్ అయిపోయింది' అంటూ వెంకయ్యనాయుడు హెళన చేస్తున్నారు. ఇదంతా ఏరుదాటి తెప్ప తగలేసిన చందంగా ఉంది. ఫలితంగా ఈ దేశంలో ప్రభుత్వాల విధానాల వలన దగాపడుతున్న ప్రజానీకంలో రైతులు ముందు వరుసలోకి వస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అయితే ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది.

నేడు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో ఏం జరుగుతున్నది..? బీజేపీకి ఘనవిజయాలను అందించిన ప్రజలే వారి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆందోళనలకు దిగుతున్నారెందుకు..? రాష్ట్రం ఏదైనా, ప్రాంతం ఏదైనా నేడు దేశంలో రైతులు అడుగుతున్నదేమిటి? చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలంటున్నారు. రుణమాఫీని తక్షణమే అమలు చేయమంటున్నారు. గిట్టుబాటు ధర కల్పించాలంటున్నారు. బలవంతంగా భూములు గుంజుకుని నిర్వాసితుల్ని చేయొద్దని వేడుకుంటున్నారు. కానీ బీజేపీ చేస్తున్నదేమిటి? వారి న్యాయమైన కోర్కెలను పెడచెవిన పెడుతున్నది. ఆందోళనకు దిగితే క్రూర అణచివేతకు పూనుకుంటున్నది. కాల్చులకు సైతం ఒడిగడుతున్నది. ఈ కాల్పుల్లో మధ్యప్రదేశ్‌లో ఆరుగురు రైతులను బలితీసుకున్నది. వందలాదిమంది రైతుల రక్తం కండ్లజూసింది. మహారాష్ట్రలో రైతులపై పెల్లెట్‌గన్స్ ప్రయోగించింది. పన్నెండుమంది రైతులను క్షతగాత్రులను చేసింది. ఇంత జరుగుతుంటే సమస్యను పరిష్కరించాల్సిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శాంతికోసం దీక్షకు కూర్చుంటారు..! మరో మంత్రి సినిమాహాల్లో టికెట్లు అమ్ముకుంటారు..! ఇంకో మంత్రి ఎన్నికల కమిషన్‌కు తప్పుడు లెక్కలు చూపినందుకు అనర్హతకు గురవుతారు. ప్రధాని మాత్రం ఉలుకూ పలుకూ లేకుండా యోగముద్రలో లీనమవుతుంటారు. తమకు పెట్టని కోట అని చెప్పుకుంటున్న ఉత్తరప్రదేశ్‌లో కూడా వేలాదిగా రైతులు రోడ్లమీదకొచ్చి శవాసనాలేసి నిరసన తెలుపుతున్నా ఆయన కండ్లు తెరువకపోవడం రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేలు వాయిస్తూ కూర్చున్న నీరో చక్రవర్తిని తలపిస్తున్నది. నోరు తెరిస్తే రైతులపై అపారమైన ప్రేమ కురిపించే ఏలికల నాలుకలు ఇప్పుడు మాట మారుస్తున్నాయి. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని అడగటమే పాపమైంది. ఒక వ్యవసాయ విధానమంటూ లేని ప్రభుత్వాలు ఎంతసేపటికీ వ్యాపార వర్గాల ప్రయోజనాలనే తప్ప ఉత్పత్తిదారులైన రైతుల ప్రయోజనాలను చూడటం లేదు. నిజానికి వ్యవసాయరంగంలో వచ్చిన మార్పుల వలన పంటల దిగుబడి పెరిగింది. ఆ మేరకు పెట్టుబడులూ పెరిగాయి. దీంతో పెరిగిన దిగుబడులకు తగిన గిట్టుబాటు ధర రాక అయినకాడికి అమ్ముకోక తప్పని పరిస్థితి రైతులకొచ్చింది. ఫలితంగా పెట్టుబడికోసం చేసిన అప్పులు పేరుకుపోయి ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి. దీనిని పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకపోగా రైతును వ్యవసాయానికి దూరం చేసి కార్పొరేట్లను వ్యవసాయంలోకి ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తున్నది. ఫలితమే నేటి వ్యవసాయ సంక్షోభం...! ఎన్నికల ముందు రుణమాఫీ అన్నారు. కొత్తగా రుణసాయం అందిస్తామన్నారు. పంట సాగులో పెట్టుబడికి అదనంగా 50శాతం లాభంతో మద్దతు ధర కల్పిస్తామన్నారు. మూడేండ్ల కింద చెప్పిందే చేయండని అడుగుతున్నారు రైతులు. ఇచ్చిన మాట నిలబెట్టుకోనందుకు సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి, అణచివేతలు, అపహాస్యాలను కానుకగా ఇస్తారా..!? ఇదేనా బీజేపీ సుపరిపాలన..? భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. నీళ్లు లేక జనం గొంతెండుతోంది. రోళ్లు పగులుతున్నాయి. భూపాలపల్లి జిల్లా చెల్పూరులో 50 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. ప్రజలు అతలాకుతలమవుతున్నారు. భద్రాద్రిలో భార్యాభర్తలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఎండవేడిమిని తట్టుకోలేక సూర్యోద్రేకానికి భస్మీపటలమైంది. 1901 నుండి నేటి వరకు ఇంత ఘనం ఎండలు ఎప్పుడూ నమోదు కాలేదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. సూర్యుడి ఉగ్రతాపానికి ఉష్ణోగ్రతలు పైకి ఎగబాకుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు ముందే హెచ్చరించారు. అయినా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. నల్లగొండ జిల్లాలో రైతు సమగ్ర సర్వేకు వెళ్లిన ఏఈఓ వడదెబ్బ తాకి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాతచెందాడు. పెద్దపల్లి జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్త విధులు ముగించుకుని వస్తుండగా వడగాలి తగిలి జ్వరంతో మరణించింది. పొలంలో మంటలు ఆర్పేందుకు వెళ్ళిన ఇద్దరు రైతులు సజీవదహనమయ్యారు. తెలుగురాష్ట్రాలలో రోజుకు సగటున 20మందికి పైగా సూర్యతాపానికి బలవుతున్నారు. సాధారణం కన్నా 5 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగితే వడగాలులుగా గుర్తిస్తారు. 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే ప్రజలు వడదెబ్బకు గురవుతారు. ఆరోగ్యశాఖ తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్రంలో 6384 మందికి వడదెబ్బ తగిలినట్టు ప్రకటించారు. 171 మంది చనిపోయినట్టు ప్రకటించారు. ఈ లెక్కలు ప్రభుత్వ ఆస్పత్రిలో నమోదైనవి మాత్రమే. ఇంకా ప్రయివేటు ఆస్పత్రులలో లెక్కలు తీసుకుంటే ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గత నాలుగేండ్లలో వడదెబ్బకు దేశవ్యాపితంగా 4620 మంది చనిపోయారు. అందులో తెలుగు రాష్ట్రాల ప్రజలే 90శాతం పైగా ఉన్నారు. ఉమ్మడిరాష్ట్రంలో 4246 మంది వడదెబ్బకు చనిపోవడం ఆందోళన కలిగించింది. ఇందులో ఎక్కువమంది ఉపాధి కూలీలూ గొర్రెల కాపరులూ కావడం విచారకరం. ప్రభుత్వం ఉపాధి కార్మికులకు నీడ, నీళ్ళు ప్రాథమిక వైద్య సౌకర్యాల ఏర్పాటులో విఫలమైంది. ఫలితంగా పేదల మరణాలకు కారణమైంది. ఇప్పుడు తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా అందుకు భిన్నంగా ఏమీలేదు. రోజూ వివిధ శాఖల పనితీరుపై తీరికలేకుండా సమీక్షలు జరుపుతున్న పాలకులు వడదెబ్బ మరణాలపై ఎందుకు సమీక్ష జరపడం లేదో ఆలోచించుకోవాలి. ఉపాధి పనులు జరుగుతున్న ప్రతిచోటా కూలీలు వడదెబ్బకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ ఆస్పత్రులలో వడదెబ్బకు గురైన వారికి ఇచ్చేందుకు కనీసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో పెట్టలేదు. ప్రభుత్వం వడగాలుల నుండి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు చైతన్య కల్పించటం మరిచింది. మండే ఎండలకు ప్రాణనష్టమే.

## ఎమ్మెల్యే మందుల సామేల్‌కు శుభాకాంక్షలు తెలిపిన పసుల అశోక్ యాదవ్



నూతనకల్, మేజర్‌న్యూస్ : ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో గెలుపొంది ఎమ్మెల్యేగా నియమితులైన తుంగతుర్తి నియోజకవర్గ ముద్దుబిడ్డ ఉద్యమ వీరుడు ఎమ్మెల్యే మందుల సామేల్‌ను మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్ గురువారం హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజలందరికీ లబ్ధి చేకూరేలా చొరవ తీసుకోవాలని, నియోజక అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

## చాకలి ఐలమ్మ విగ్రహం భూమి పూజ



హాలియా, మేజర్‌న్యూస్ : నల్గొండ జిల్లా హాలియా మండల పరిధిలోని రామడుగు గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహం భూమి పూజ చేయడం జరిగినది. ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ నాయకుడు కాకునూరి నారాయణ, కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి గ్రామ శాఖకాంగ్రెస్ పార్టీ నాయకుడు సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ ఆవుల యల్లమ్మ యాదయ్య, రామడుగు సర్పంచ్ వెంకటరమణారెడ్డి, శంకరయ్య, లింగయ్య, సైదిరెడ్డి, సీనయ్య, నాగయ్య. గ్రామ చాకలి యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర మహిళా కన్వీనర్‌గా నోముల దీప్తి



వలిగొండ, మేజర్‌న్యూస్ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించడం జరిగింది. ఈ యొక్క జాతీయ మహాసభలలో తెలంగాణ రాష్ట్ర మహిళా కన్వినర్‌గా వలిగొండ మండలం రెడ్ల రేపాక గ్రామానికి చెందిన నోముల దీప్తిని నియమిస్తున్నట్టు ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా " జానారెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. నోముల దీప్తి గతంలో విద్యారంగ సమస్యల పట్ల అనేక ఉద్యమాలు నిర్వహించి విద్యారంగ సమస్యలను పరిష్కరించిదని అన్నారు. వీరి చదువు దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి చదువుతుంది గతంలో కళాశాల ఉపాధ్యక్షులు నగర మహిళ కన్వి నర్‌గా రాష్ట కార్యవర్గ సభ్యులుగా పనిచేశారు విద్యారంగ సమస్యలతో పాటు విద్యార్థులను జాతీయవాదులుగా తీర్చిదిద్దడంలో కీలకమైన పాత్ర పోషించాలని అన్నారు కావున రానున్న రోజులలో విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తూనే ఏబీవిపి బలోపేతం చేస్తారని నమ్మకంతో మహిళా రాష్ట్ర కన్వీనర్‌గా నియమిస్తున్నట్టు రాష్ట్ర అధ్యక్షులు జాన్‌రెడ్డి తెలిపారు. అనంతరం నోముల దీప్తి మాట్లాడుతు నాపై నమ్మకం ఉంచి ఈ యొక్క బాధ్యత ఇచ్చినందుకు ఏబీవిపీని ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దే విధంగా ఆర్గనైజేషన్ బలోపేతం కోసం కృషి చేస్తా అని అన్నారు. విద్య రంగ సమస్యల పట్ల అనేక కార్యక్రమాలను నిర్వహిస్తానని అన్నారు నాపై నమ్మకం ఉంచి నాకు యొక్క బాధ్యత ఇచ్చినందుకు ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులు జానారెడ్డికి ఏబీవీపీ రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో ఎస్.వీ.ఎన్ స్కూల్ బెస్ట్ : డాక్టర్ గిరిధర్








యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఎస్.వీ.ఎన్ తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని యాదగిరిగుట్ట తిరుమల నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ ఎం.గిరిధర్ అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు విద్యతోపాటు మంచి ఆరోగ్యాన్ని కలిగి ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. అందుకోసం సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. చలికాలంలో తీసుకోవాల్సిన చర్యలపై ఆయన వివరించారు. ఎట్టి పరిస్థితిలోనూ చల్లటి పదార్థాలు తినకూడదని, కూల్ డ్రింక్స్ ఇతర సాఫ్ట్ డ్రింక్స్ కు మొత్తం వింటర్ పూర్తయ్యే వరకు దూరంగా ఉండాలని చెప్పారు. విద్యార్థుల్లో ముందు జాగ్రత్తలు తీసుకునే ధోరణి పెరగాలని ఆయన సూచించారు. టాబ్లెట్లు వాడడం కన్నా రోగాలు రాకుండా చూసుకోవడం బెటర్ అని ఆయన విద్యార్థులకు సూచించారు. తుంగతుర్తి సిహెచ్ఓ ఎం.వీణ మాట్లాడుతూ విద్యార్థినులు నెలవారీగా వచ్చే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని చెప్పారు. మంచి ఆహారం తీసుకోవాలన్నారు. మధ్యాహ్నం ఎట్టి పరిస్థితుల్లోనూ సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చుననీ చెప్పారు. స్కూలుకు వచ్చే విద్యార్థినులు చాలా తక్కువగా భోజనాన్ని తీసుకుంటారని దానివల్ల సరిపోను ప్రోటీన్లు మాంసకృత్తులు లోపించడం వల్ల అనేక రోగాల బారిన పడుతుంటారని చెప్పారు. యాదగిరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హరీష్, గుల్లపల్లి వైద్యాధికారి డాక్టర్ స్వర్ణ లు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలు ప్రబలకుండా చూసుకోవచ్చు అని వారు హితవు పలికారు. ఎస్.వీ.ఎన్ డిజిటల్ స్కూల్ ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన వాతావరణంలోనే నాణ్యతతో కూడిన విద్యా ప్రమాణాలు పెరుగుతాయని చెప్పారు. అందువల్ల విద్యార్థిని విద్యార్థులకు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఆరోగ్య పరిరక్షణకు పాటుపడుతున్నట్లు చెప్పారు.

## ప్రజా శాంతి, ప్రశాంతతకు భంగం కలిగించవద్దు

### ఎస్ఐ చందా వెంకటేశ్వర్లు




మునుగోడు, మేజర్‌న్యూస్ : ప్రజా శాంతి, ప్రశాంతతకు భంగం కలిగించవద్దు అని ఎస్ఐ చందా వెంకటేశ్వర్లు కోరారు. గురువారం మండల కేంద్రంలోని కూరగాయల సంతలో అమ్ముకునే కూరగాయల విక్రయదారులతో సంభాషించినారు. వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయకూడదని సూచించినారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి చూపించిన స్థలంలో విక్రయదారులకు సంబంధించిన వాహనాలను నిలుపుకోవాలన్నారు. గురువారం సంతకు వచ్చే కొనుగోలుదారులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. ప్రతి గురువారం జరిగే మార్కెట్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ సహకరించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కుంభం సుమలత రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మురళీమోహన్, కూరగాయల విక్రయదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మీ సేవ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ

మునగాల, మేజర్‌న్యూస్ : మునగాల మండల కేంద్రంలోని మీసేవా సెంటర్‌లను కోదాడ ఆర్డిఓ సూర్యనారాయణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దరఖాస్తుదారులును మీ సేవాలోని సేవలు సరిగా అందుతున్నాయా లేడా అని వాకబు చేసినారు. ప్రభుత్వము నిర్ణయించిన తీసుకోవాలన్నారు. నిర్ణితధరల కంటే అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ ఉన్నారు.

## మంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఇంజ నరేష్



యాదగిరిగుట్ట, మేజర్ న్యూస్ : గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ, వారికి కేటాయించబడిన సెక్రటేరియట్ ఛాంబర్‌లో పూజా కార్యక్రమానికి ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇంజ నరేష్ హాజరై వారికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.

## బంగారి శివ పార్థివదేహానికి నివాళులర్పించిన జెడ్పి చైర్మన్



వలిగొండ, మేజర్ న్యూస్ : మండల పరిధిలోని వర్కట్ పల్లి గ్రామ బిఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు బంగారి శివ అకాల మరణాన్ని తెలుసుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి వర్కట్‌పల్లి గ్రామానికి విచ్చేసి బంగారి శివ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట గ్రామ సర్పంచ్ మీసాల శేఖర్ గ్రామ బిఆర్ఎస్ కార్యకర్తలు తదితర నాయకులు పాల్గొన్నారు.